# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి ‖ సంపుటి : 1 ‖ సంచిక : 2 ‖ ఆదివారం ‖ 16.08.2026 ‖ పేజీలు : 8 ‖ వెల రూ. 2

Medchal Malkajgiri ‖ Volume: 1 ‖ Issue: 2 ‖ Sunday ‖ 16.08.2026 ‖ Pages: 8 ‖ Rate: 2


## మహిళా కోటా.. క్రెడిట్ మీకే!

- విపక్షాలకు మోదీ కీలక విజ్ఞప్తి
- విమెన్ కు 33 శాతం హక్కు




80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీ కీలక రాజకీయ పిలుపునిచ్చారు. పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలును రాజకీయ పోరుగా మార్చకుండా అన్ని పార్టీలు కలిసి ముందుకు రావాలని కోరారు. మహిళా రిజర్వేషన్ అంశం రాజకీయ విభేదాల కారణంగా దాదాపు 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని మోదీ పేర్కొన్నారు. "మహిళలకు వారి హక్కు కల్పించండి.. క్రెడిట్ మీరే తీసుకోండి" అన్న సందేశంతో విపక్షాలను నేరుగా ఉద్దేశించారు. తల్లులు, సోదరీమణులకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లభిస్తే దేశ విధానాల రూపకల్పనలో వారి పాత్ర మరింత పెరుగుతుందని చెప్పారు. మహిళా సాధికారతను రాజకీయ లాభనష్టాలకతీతంగా చూడాలని మోదీ పిలుపునిచ్చారు.

## కోరుకున్న ప్రియుడు




ప్రేమలో పడినప్పుడు ప్రపంచం మారదు... మన కళ్లే ప్రపంచాన్ని కొత్తగా చూస్తాయి. నిన్నటి వరకు మామూలుగా కనిపించిన ఆకాశం ఒక్కసారిగా మరింత నీలంగా అనిపిస్తుంది. రద్దీ రోడ్డుపై కూడా అతని అడుగుల శబ్దమే వినిపిస్తుంది. ఫోన్ స్క్రీన్‌పై ఒక మెసేజ్ కనిపిస్తే గుండె ఒక్కసారిగా వేగం పెంచుకుంటుంది. ఆమె నవ్వు కోసం రోజంతా ఎదురుచూడటం, అతని "నేనున్నా" అనే ఒక్క మాట కోసం ఎన్నో కష్టాలను మర్చిపోవడం... ఇదే ప్రేమ మొదటి మత్తు. కానీ జీవితం సినిమా కాదు. పూలు, బహుమతులు, రాత్రివేళ ఫోన్ కాల్స్‌తోనే ప్రేమ కథ పూర్తికాదు. అసలు కథ మొదలయ్యేది సమస్యలు మొదలైనప్పుడు. జీతం సరిపోని నెలలో, ఇంట్లో ఒత్తిడి ఉన్న రోజుల్లో, ఆరోగ్యం సహకరించని సమయంలో, మాటలు తగ్గిపోయిన రాత్రుల్లో... "నువ్వు ఎలా ఉన్నావు?" అని నిజంగా అడిగే మనిషే మనసుకు కావాల్సిన ప్రియుడు. సంతోషంలో ఫొటో దిగేవాడు కాదు... కన్నీళ్లలో ఫోన్ పక్కన పెట్టి ఎదురుగా కూర్చునేవాడే కావాలి. నీ తప్పును సమర్థించేవాడు కాదు... ప్రేమగా సరిదిద్దేవాడే కావాలి. నీ స్వేచ్ఛను లాక్కునేవాడు కాదు... నీ కలలకు చోటిచ్చేవాడే కావాలి. ఎందుకంటే ప్రేమలో మనం కోరుకునేది అందమైన మనిషిని కాదు... మన జీవితంలోని అందమైన, కఠినమైన ప్రతి రోజునూ కలిసి మోయగల మనిషిని. అలాంటి ప్రియుడిని వెతకడం ఒక కోరిక కావచ్చు... కానీ అతన్ని గుర్తించడం మాత్రం జీవితంలోనే పెద్ద పరీక్ష.

## ఏది నిజం..ఎవరు నిజం?

**వందేమాతరంపై మళ్లీ రగడ!**

**ఒకే దృశ్యం.. రెండు భిన్న అర్థాలు**

**సోనియా సంకేతాలు.. బీజేపీ ఆరోపణలు**

స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశభక్తి గీతం చుట్టూ మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో వందేమాతరం పూర్తి ఆరు చరణాలతో ఆలపించిన వేళ సోనియా గాంధీ చేసిన కొన్ని సంకేతాలు ఇప్పుడు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వైపు చూపించడం, అనంతరం సేవాదళ్ నేతలతో మాట్లాడటం కనిపించడంతో బీజేపీ తీవ్ర ఆరోపణలకు దిగింది. పూర్తి వందేమాతరాన్ని అడ్డుకునేందుకు సోనియా ప్రయత్నించారని బీజేపీ విమర్శిస్తే.. కాంగ్రెస్ మాత్రం ఆ ఆరోపణలను పూర్తిగా ఖండిస్తోంది. ఖర్గే చాలాసేపు నిల్చొని ఉండటంతో ఆయనకు కుర్చీ ఏర్పాటు చేయాలని మాత్రమే సోనియా సూచించారని వివరణ ఇచ్చింది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలైంది. ఒకే దృశ్యం.. రెండు భిన్న అర్థాలు! పైగా వందేమాతరంపై కేంద్రం ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలు, జాతీయ గౌరవానికి సంబంధించిన చట్ట సవరణలు ఈ వివాదానికి మరింత ప్రాధాన్యం తెచ్చాయి. పాటను పూర్తిగా ఆలపించారా లేదా అన్న విషయంలో పెద్దగా భేదాభిప్రాయం లేకపోయినా.. సోనియా సంకేతాల అసలు ఉద్దేశం ఏమిటన్నదే ఇప్పుడు రాజకీయ రగడకు కేంద్రబిందువైంది. దేశభక్తి గీతం రాజకీయ విమర్శలకు ఆయుధంగా మారిందా? లేక సాధారణ సూచనకే రాజకీయ రంగు పులిమారా? అసలు ఏది నిజం.. ఎవరు నిజం? (వివరాలు 3లో..)






## బీసీఐకి నల్సార్ విద్యార్థుల కౌంటర్

**ఎన్‌రోల్‌మెంట్ ఆపే అధికారం ఎవరిచ్చారు?**

**మొత్తం బ్యాచ్‌ను ఎలా ఆపుతారంటూ ధ్వజం**

## మాది మాకిచ్చేయండి

**అబ్దుల్లా డబుల్ సందేశం • పీవోకేపై సంచలన వ్యాఖ్యలు**

జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఒకే మాటతో రెండు రాజకీయ సందేశాలు ఇచ్చారు. ఒకవైపు 2019 తర్వాత జమ్మూకశ్మీర్‌కు దూరమైన హక్కులను తిరిగి ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు.







## ఏ కులము నీదంటే..!

**రెండో దశలో క్యాస్ట్ వివరాల నమోదు**

**వివరాల నమోదుకు దేశ వ్యాప్త విధానం**

**కులం లెక్కలోకి.. జనగణనలో కీలక మార్పు**

## యువతే దేశానికి పవర్ ఇంజిన్!

**సద్వినియోగమైతే వరం.. లేదంటే భారం**

**నవతరమే భారత్ బలమన్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్**

భారత్‌లోని భారీ యువ జనాభాను సక్రమంగా తీర్చిదిద్దితే అది దేశ ఆర్థికాభివృద్ధికి శక్తివంతమైన ఇంజిన్‌గా మారుతుందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాగ్‌పూర్‌లో లోకమత్ మీడియా గ్రూప్ నిర్వహించిన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.




## గ్యాస్ ఈకేవైసీకి నేటితో గడువు

ఆదివారం ఎలా చేయాలన్న బెంగ!




## ఆల్ఫ్రాజోలం కేసు

**ఎస్ఎం ల్యాబ్స్ ఈడీ మాణిక్యరెడ్డి అరెస్ట్**

## బీజేపీ, బీఆర్ఎస్ నాణేనికి బొమ్మా బొరుసు?

- రేషన్ కార్డు.. పేదల ఆత్మగౌరవం!
- పేదరికంపై స్మార్ట్ కార్డుతో పోరాటం
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వేళ సీఎం




సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమంపై కీలక వ్యాఖ్యలు చేశారు. రేషన్ కార్డు కేవలం ప్లాస్టిక్ కార్డు కాదు.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని స్పష్టం చేశారు. ఉచిత బియ్యం అందించే సాధనంగా మాత్రమే చూడకుండా పేదరిక నిర్మూలనకు ఇది బలమైన అడుగని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ పేదవాడు ఆకలితో అలమటించకూడదన్న లక్ష్యంతో కాంగ్రెస్ హయాంలో రేషన్ వ్యవస్థ ఏర్పడిందని గుర్తుచేశారు. తెలంగాణలో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కార్డులు రూపొందించామని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ స్పష్టం చేశారు.

## ఎంఐఎం నేతలకు అడ్డుకునే దమ్ము ఉందా?

2లో..

**భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షలాది మందితో వందేమాతరం పాడిస్తా..**

- తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం కాంగ్రెస్‌ది
- బీజేపీ ఎంపీ బండి సంజయ్ హాట్ కామెంట్స్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మితే ఊడిపోయేంత బలహీనంగా మారిందని బీజేపీ ఎంపీ బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒకవైపు కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం తన క్రెడిట్ కొట్టేస్తోందని, మరోవైపు ప్రజల భూములను 22ఏ నిషేధిత జాబితాలో పెట్టి మహాదోపిడీకి తెరలేపిందని ఆరోపించారు. "ఏనుగులు మింగేటోడు పోయి.. పీనుగలు మింగేటోడు వచ్చాడు" అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో వందేమాతరం అంశాన్ని తెరపైకి తెచ్చిన సంజయ్.. "భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షలాది మందితో వందేమాతరం పాడిస్తా.. అడ్డుకునే దమ్ము ఎంఐఎం నేతలకు ఉందా?" అంటూ నేరుగా సవాల్ విసిరారు. "సొమ్ము ఒకడిది.. సోకు ఇంకొకడిదా?" అంటూ రేషన్ బియ్యంపై కాంగ్రెస్‌ను నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల నుంచి 22ఏ భూముల వరకు.. వందేమాతరం నుంచి కేంద్ర నిధుల వరకు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కో అంశంతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.



## అన్నం పెట్టే రాష్ట్రాన్ని నాశనం చేశారు

**రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఆగ్రహం**




తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా ఉన్న వ్యక్తి ప్రస్తుతం ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ విమర్శించారు. "ఆయన ఏనాడూ జై తెలంగాణ అనలేదు.. అలాంటి వ్యక్తికి తెలంగాణ అభివృద్ధిపై ఎంత చిత్తశుద్ధి ఉంటుంది?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో విద్యుత్ సమస్యలు ఉండేవని, కేసీఆర్ హయాంలో 24 గంటల విద్యుత్ అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కూడా విద్యుత్ సమస్యలు కనిపిస్తున్నాయని అన్నారు. కల్యాణలక్ష్మిపై కోర్టులో కౌంటర్ దాఖలు చేయడానికి కూడా ప్రభుత్వానికి సమయం లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సింగిల్ ఇంజన్‌తోనే వేగంగా దూసుకెళ్లిందని చెప్పారు. రేవంత్‌రెడ్డి 18 గంటలు పనిచేస్తున్నానని చెబుతున్నారని, ఆ శ్రమ ఎవరి ప్రయోజనాల కోసం అని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్రం చెబుతున్న డబుల్ ఇంజన్ పాలన కంటే తెలంగాణలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు.

## రేవంత్ అబద్ధాల ప్రచారం

»కేసీఆర్‌ను తిట్టడమే పని

»సీఎం ప్రసంగంపై హరీశ్ ఫైర్

సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా కేసీఆర్‌ను తిట్టడమే రేవంత్ పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సిద్దిపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్ ప్రసంగంపై హరీశ్‌రావు సెటైర్లు వేశారు. సాయంత్రం 4.20 గంటలకు ప్రసంగం మొదలుపెట్టి 420 మాటలు మాట్లాడారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధిపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆరోపించారు. రేవంత్ చేతకానితనం వల్లే సింగూరు ఖాళీ అయిందని, కామారెడ్డి జిల్లాకు మంచినీటి సమస్య వచ్చిందని విమర్శించారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను గత ప్రభుత్వం ప్రారంభిస్తే కాంగ్రెస్ వాటిని మూలన పడేసిందని అన్నారు. (వివరాలు 2లో..)



## బీజేపీ ఎంపీ చూపు.. కాంగ్రెస్ వైపు?

**• లోపల మాటలు.. బయట విమర్శలు • ఢిల్లీ భేటీ.. తెలంగాణలో కొత్త చర్చ**




తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఇప్పుడు బయటకు పెద్దగా వినిపించని ఓ చర్చ మాత్రం లోపల బలంగా తిరుగుతోంది. బీజేపీకి చెందిన ఓ తెలంగాణ ఎంపీ కాంగ్రెస్ జాతీయ నాయకత్వంతో టచ్‌లో ఉన్నారన్న సమాచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఇందులో భాగంగానే ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆ ఎంపీ రహస్యంగా సమావేశమైనట్లు ప్రచారం జరుగుతోంది. భేటీ ఎక్కడ జరిగింది? ఏ అంశాలపై చర్చ జరిగింది? ఇది కేవలం వ్యక్తిగత పరిచయమా? లేక రాజకీయ భవిష్యత్తుపై ముందస్తు సంభాషణా? అన్నదానిపై మాత్రం స్పష్టత లేదు. అయితే ఈ భేటీ గురించి తెలిసిన వర్గాలు చెబుతున్న మాటల్లో మాత్రం ఒక ఆసక్తికరమైన రాజకీయ లెక్క కనిపిస్తోందని అంటున్నారు. "మాది కూడా కాంగ్రెస్ ఫ్యామిలీనే" అంటూ ఏఐసీసీ పెద్దల వద్ద సాన్నిహిత్యం పెంచుకునే ప్రయత్నం జరుగుతోందన్న చర్చ కూడా వినిపిస్తోంది. దీనిపై అధికారికంగా ఎలాంటి ధృవీకరణ లేదు. కానీ ఢిల్లీ రాజకీయాల్లో చిన్న కదలిక కూడా తెలంగాణలో పెద్ద సంకేతంగా మారే పరిస్థితుల్లో ఈ వ్యవహారం చర్చకు రావడం సహజంగానే ఆసక్తి పెంచుతోంది. (వివరాలు 5లో..)

# బీజేపీ, బీఆర్ఎస్ నాణేనికి బొమ్మా బొరుసా?

- రేషన్ కార్డు.. పేదల ఆత్మగౌరవం!
- పేదరికంపై స్మార్ట్ కార్డుతో పోరాటం
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వేళ సీఎం



**సన్నబియ్యం ఘనత మాదే**

రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీని కూడా రేవంత్‌రెడ్డి ప్రధానంగా ప్రస్తావించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో 3.48 కోట్ల మంది ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. పేదలకు ప్రతి నెలా ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.14,800 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. దేశంలో సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొడ్డు బియ్యం ఇచ్చేవారని, అది నాణ్యత లేకపోవడంతో పేదలు ఇబ్బంది పడ్డారని విమర్శించారు. గత ప్రభుత్వం పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించిన సీఎం..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. పేదల ఆకలి తీర్చడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

**బీజేపీ–బీఆర్ఎస్‌పై దాడి**

సంగారెడ్డి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్‌పై తీవ్ర రాజకీయ విమర్శలు చేశారు. “బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు కావు.. ఒకే నాణేనికి బొమ్మా బొరుసు లాంటివి” అంటూ ఘాటు వ్యాఖ్య చేశారు. పేదల ఆకలి తీర్చడంపై ఈ రెండు పార్టీలు ఎప్పుడైనా ఆలోచించాయా అని ప్రశ్నించారు. రైతుల కోసం రూ.90 వేల కోట్లు చెల్లించామని, ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, కొత్తగా 2.5 లక్షల పెన్షన్లు మంజూరు చేశామని వెల్లడించారు. గత పాలకులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో హామీలు ఇచ్చినా పేదలకు ఇళ్లు అందలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం సంక్షోభం నుంచి తెలంగాణను సంక్షేమం వైపు తీసుకెళ్తోందని అన్నారు.

**కేసీఆర్‌కు సవాల్.. అసెంబ్లీలో తేల్చుకుందామా?**

సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో బహిరంగ చర్చకు సిద్ధమని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. “పదేళ్లలో మీరు ఏం చేశారు.. రెండున్నరేళ్లలో మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చిద్దాం” అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రస్తుతం రూ.75 వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని ఆరోపించారు. రైతులు, మహిళలు, పేదలు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, నిరుద్యోగుల కోసం తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. త్వరలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. యువత మాయమాటలకు మోసపోవద్దని హెచ్చరించారు. ఇదే సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయంగా ఒకే వైపు నిలుస్తున్నాయన్నది రేవంత్ ప్రధాన ఆరోపణగా కనిపించింది. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇళ్లు, పెన్షన్లు, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ అంశాలను ముందుకు తెచ్చిన సీఎం..గత పాలనతో ప్రస్తుత పాలనను పోల్చి చూపే ప్రయత్నం చేశారు. సంగారెడ్డి సభతో సంక్షేమమే కాంగ్రెస్ రాజకీయ ఆయుధమన్న సందేశాన్ని రేవంత్ బలంగా వినిపించారు.

## జగ్గారెడ్డి హనుమంతుడి లాంటోడు

**సంగారెడ్డిలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు**

సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై ప్రశంసలు కురిపించారు. “రాహుల్ గాంధీ రాముడైతే.. జగ్గారెడ్డి హనుమంతుడి లాంటి వాడు” అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల్లో ఉండే నాయకుడు జగ్గారెడ్డి అని కొనియాడారు. ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజలకు దూరం కాకుండా వారి మధ్యే తిరుగుతున్నారని అన్నారు. రూ.వెయ్యి కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడని రేవంత్ పేర్కొన్నారు. ఆయన్ను ఓడించడం ప్రజల దురదృష్టమని వ్యాఖ్యానించారు. కుటుంబాన్ని సైతం పక్కన పెట్టి ప్రజల కోసం పనిచేస్తున్నారని ప్రశంసించారు. నాయకులకు మార్కులు వేస్తే తనకంటే జగ్గారెడ్డికే ఎక్కువ మార్కులు వస్తాయని అన్నారు. జగ్గారెడ్డి ప్రజాజీవితంలో కొనసాగాలని సీఎం ఆకాంక్షించారు.

# భాగ్యలక్ష్మి ఆలయం వద్ద వందేమాతరం

- అడ్డుకునే దమ్ము ఎంఐఎం నేతలకు ఉందా?
- తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం కాంగ్రెస్‌ది
- బీజేపీ ఎంపీ బండి సంజయ్ హాట్ కామెంట్స్



80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రకోటపై ప్రధాని మోదీ కోటి మంది యువతకు ఏఐ శిక్షణ అందిస్తామని ప్రకటించడం హర్షణీయమని చెప్పారు. పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామని చెప్పడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ యువత తరపున ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. రోజ్‌గార్ మేళా ద్వారా 12 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదే అని చెప్పారు. ఇదే సమయంలో తెలంగాణలో వందేమాతరం అంశాన్ని ప్రస్తావించారు. గతంలో అసెంబ్లీలో వందేమాతరం గీతాలాపనను ఎంఐఎం బహిష్కరించినప్పుడు కాంగ్రెస్ వత్తాసు పలికిందని ఆరోపించారు. ఇక వందేమాతరాన్ని అవమానించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని అన్నారు. పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షలాది మందితో వందేమాతరం గీతాలాపన నిర్వహిస్తానని, అడ్డుకునే దమ్ము ఎంఐఎం నేతలకు ఉందా? అంటూ సవాల్ విసిరారు. వందేమాతరం అవమానంపై చట్టంలో శిక్షలు ఉన్నాయని గుర్తుచేస్తూ.. తమపై మతతత్వవాదుల ముద్ర వేయడం సరికాదని అన్నారు.

**రేషన్ కార్డులో మోదీ ఫోటో ఎందుకు?**

తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై సీఎం, మంత్రుల ఫోటోలు ఎందుకని బండి సంజయ్ ప్రశ్నించారు. “రేషన్ బియ్యం ఉచితంగా ఇచ్చేది మోదీ ప్రభుత్వం కాదా?” అని నిలదీశారు. తెలంగాణలో 57 లక్షల కార్డుదారులకు దాదాపు రెండు కోట్ల మందికి కేంద్రం ఉచిత బియ్యం అందిస్తోందని చెప్పారు. అలాంటప్పుడు కార్డులపై ప్రధాని మోదీ ఫోటో ఎందుకు లేదని ప్రశ్నించారు. “సొమ్ము ఒకడిది.. సోకు ఇంకొకడిదా?” అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పాలనలోనూ కేంద్ర పథకాలను రాష్ట్ర పథకాలుగా ప్రచారం చేశారని ఆరోపించారు. పంచాయతీలకు కేంద్ర నిధులు, పీఎంఏవై ఇళ్ల విషయంలోనూ ఇదే ధోరణి కొనసాగిందని అన్నారు. తెలంగాణలో జనాభా, రేషన్ లబ్ధిదారుల సంఖ్యపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదాయపన్ను దాఖలు చేస్తున్న వారికి కూడా ఉచిత బియ్యం అందుతున్నదా అని ప్రశ్నించారు.

**22ఏ జాబితాపై మహాదోపిడీ ఆరోపణ**

తెలంగాణలో భూములను నిషేధిత 22ఏ జాబితాలో చేర్చడంపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో మొత్తం 2.77 కోట్ల ఎకరాల భూమి ఉంటే దాదాపు 95 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో ఎలా పెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వం విక్రయించిన భూములు, హెచ్ఎండీఏ వేలం వేసిన స్థలాలు, ప్రజలు డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన భూములు, పరిశ్రమలకు కేటాయించిన భూములు సైతం 22ఏలో ఉన్నాయని ఆరోపించారు. భూములను జాబితా నుంచి తొలగించాలని ప్రజలు ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా వచ్చే ఏడాది నుంచి ముందుగానే ఇస్తామని కాంగ్రెస్ చెబితే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. “కాంగ్రెస్ అభయహస్తం తెలంగాణ ప్రజల పాలిట భస్మాసుర హస్తంగా మారింది” అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో పెద్దగా తేడా లేదని ఆరోపిస్తూ.. పెన్షన్లు, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలను ప్రస్తావించారు.

**తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం కాంగ్రెస్‌ది**

కాంగ్రెస్ హామీలపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేసీఆర్ పదేళ్లలో రూ.6 లక్షల కోట్ల అప్పు చేస్తే.. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్లలో రూ.3 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపించారు. “తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం కాంగ్రెస్‌ది” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనను విమర్శిస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎం నుంచి ఢిల్లీ నాయకత్వం వరకు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటోందని విమర్శించారు. జెన్‌జీ యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిస్తూ.. 21 ఏళ్లకే చట్టసభలకు వచ్చేలా నిర్ణయం తీసుకోవడానికి ఎవరూ వ్యతిరేకం కాదని అన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే జెన్‌జీకి మంత్రి పదవులు, ఎమ్మెల్సీ అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్లలో తెలంగాణకు రూ.13 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదని చెప్పారు. హైవేలు, రీజినల్ రింగ్ రోడ్ కోసం రూ.1.74 లక్షల కోట్లు ఖర్చు చేశామని, బుల్లెట్ ట్రైన్ కారిడార్‌కు మరో రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే తెలంగాణకు మరింత అభివృద్ధి సాధ్యమని బండి సంజయ్ అన్నారు.

# దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

- 89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం
- సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




సంగారెడ్డిలో జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో అమలు చేస్తున్న తరహాలో దేశంలోని మరే రాష్ట్రంలోనూ సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని అన్నారు. 3.42 కోట్ల మందికి రూ.14,800 కోట్ల వ్యయంతో సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో 89 లక్షల రేషన్ కార్డులు మాత్రమే ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని 2.80 కోట్లకు పెంచిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు.

**దొడ్డు బియ్యం నుంచి సన్నబియ్యం**

గత ప్రభుత్వ హయాంలో రేషన్ ద్వారా ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని చాలామంది తినేవారు కాదని ఉత్తమ్ విమర్శించారు. కొందరు వాటిని కిలో రూ.10కు విక్రయించేవారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి రైతుల నుంచి కొనుగోలు చేసి, అదే నాణ్యమైన బియ్యాన్ని పేదలకు అందిస్తోందని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండానే తెలంగాణలో దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని అన్నారు. వరి కొనుగోళ్ల కోసం రైతుల ఖాతాల్లో రూ.90 వేల కోట్లు జమ చేశామని వెల్లడించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు పదేపదే తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని ఉత్తమ్ సూచించారు.

**స్మార్ట్ కార్డు అంటే గౌరవం**

స్మార్ట్ రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకు ఉపయోగించే పత్రం కాదని, పేద కుటుంబానికి గౌరవం, ఆహార భద్రత, ప్రభుత్వ గుర్తింపు అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గానికి మూడు వేల ఇందిరమ్మ ఇళ్లు అందించే కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు. అర్హత ఉన్న కొత్త దరఖాస్తుదారులను పరిశీలించి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఉత్తమ్ స్పష్టం చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ తెలంగాణ చరిత్రలో ప్రత్యేక రోజుగా నిలుస్తుందని అన్నారు. సన్నబియ్యం పంపిణీ, కొత్త కార్డుల సంఖ్యపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు గణాంకాలతో సమాధానం ఇచ్చామని మంత్రి పేర్కొన్నారు.

# యువతే దేశానికి పవర్ ఇంజిన్!

- సద్వినియోగమైతే వరం.. లేదంటే భారం
- నవతరమే భారత్ బలమన్న ఆర్ఎస్ఎస్ చీఫ్



భారత్‌లోని భారీ యువ జనాభాను సక్రమంగా తీర్చిదిద్దితే అది దేశ ఆర్థికాభివృద్ధికి శక్తివంతమైన ఇంజిన్‌గా మారుతుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాగ్‌పూర్‌లో లోక్‌మత్ మీడియా గ్రూప్ నిర్వహించిన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. యువతను సరైన విద్య, నైపుణ్యాలు, ఉపాధితో సిద్ధం చేస్తే దేశానికి గొప్ప ఆస్తిగా మారతారని చెప్పారు. అదే సమయంలో యువతకు సరైన దిశ, నైపుణ్యాలు, ఉపాధి కల్పించడంలో విఫలమైతే ఇదే జనాభా సమాజానికి భారంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రస్తుతం యువకులుగా ఉన్నవారు మరో 30 ఏళ్లలో వృద్ధులవుతారని గుర్తు చేస్తూ.. తమ తర్వాతి తరానికి ఎలాంటి దేశాన్ని అందించాలనే విషయాన్ని ఇప్పటి నుంచే ఆలోచించాలని సూచించారు.

**ఉద్యోగం అంటే జీతం మాత్రమే కాదు**

దేశంలో ఉపాధిని కేవలం ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఉద్యోగాలకు పరిమితం చేయకూడదని భగవత్ అభిప్రాయపడ్డారు. కార్మిక శ్రమ, పరిశ్రమలు, వ్యాపార రంగం, స్టార్టప్‌లు, స్వయం ఉపాధికి కూడా గౌరవం పెరగాలి అని అన్నారు. యువత రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలని, వైఫల్యాలకు భయపడకుండా కొత్త ప్రయత్నాలు చేయాలని పిలుపునిచ్చారు. అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా వంటి దేశాలతో పోల్చుకుంటూ అభివృద్ధిని కొలవడం కంటే.. భారతదేశ పరిస్థితులకు తగిన సొంత ప్రమాణాలను రూపొందించుకోవాలని సూచించారు. భారత్ విస్తారమైన జనాభా, పరిమిత భౌగోళిక విస్తీర్ణం, ప్రత్యేక వనరుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించుకోవాలని అన్నారు. దేశ ప్రగతి కేవలం సంపద సృష్టితోనే కొలవకూడదని స్పష్టం చేశారు.

**భిన్నాభిప్రాయాలే ప్రజాస్వామ్య బలం**

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో భగవత్ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, వైవిధ్యం గురించి కూడా ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో భిన్న ఆలోచనలు, విభిన్న అభిప్రాయాలకు స్థానం ఉంటుందని చెప్పారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై బలంగా గొంతు వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. చర్చ, వాదన, పరస్పర అభిప్రాయాల మార్పిడి ప్రజాస్వామ్యానికి కీలకం అని పేర్కొన్నారు. పది రోజుల్లోనే జనరేషన్ జెడ్‌తో ఆయనకు ఇది రెండో సమావేశం. ఆగస్టు 6న నీట్ పేపర్ లీక్ వంటి అవకతవకలపై యువత చేసిన నిరసనలను ప్రస్తావిస్తూ.. వారి ఆందోళనలకు న్యాయమైన కారణాలు ఉంటే నిరసన చేయడం వల్ల వారు దేశ వ్యతిరేకులు కాబోరని భగవత్ గతంలో స్పష్టం చేశారు. మొత్తంగా యువతకు నైపుణ్యం, ఉపాధి, సరైన దిశ కల్పిస్తే భారత్ బలపడుతుందని..నిర్లక్ష్యం చేస్తే అదే యువ జనాభా సవాలుగా మారుతుందని ఆయన హెచ్చరించారు.

# ఆల్ప్రాజోలం కేసు



**ఎస్ఎం ల్యాబ్స్ ఈడీ మాణిక్యరెడ్డి అరెస్ట్**

హైదరాబాద్‌లో వెలుగుచూసిన రూ.74 కోట్ల విలువైన ఆల్ప్రాజోలం కేసు దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో ఎస్ఎం ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాణిక్యరెడ్డిని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో లక్ష్మీకుమార్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్న అధికారులు.. అతడి నుంచి సేకరించిన సమాచారంతో మాణిక్యరెడ్డిని కస్టడీలోకి తీసుకున్నారు. ఆల్ప్రాజోలం తయారీకి సంబంధించి ల్యాబ్‌లో జరిగిన కార్యకలాపాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం.

**ఏప్రిల్ ఒప్పందమే కీలక ఆధారమా?**

దర్యాప్తులో భాగంగా ఏప్రిల్ 16న లక్ష్మీకుమార్, మాణిక్యరెడ్డి మధ్య ఒప్పందం జరిగినట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఆ ఒప్పందం తర్వాత ఏప్రిల్ 17 నుంచి 20 వరకు ఆల్ప్రాజోలం తయారీ జరిగినట్లు అనుమానిస్తున్నారు. భారీ స్థాయిలో తయారైన డ్రగ్‌ను ఉత్తర భారత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ప్రయత్నాలు పూర్తికాకముందే అధికారులు ఎస్ఎం ల్యాబ్స్‌పై దాడులు నిర్వహించడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆల్ప్రాజోలం తయారీ వెనుక అసలు ప్రణాళిక ఏమిటి? ఎవరి ఆదేశాలతో ఉత్పత్తి జరిగింది? అన్న కోణాల్లో విచారణ సాగుతున్నట్లు సమాచారం.

**పూర్తి నెట్‌వర్క్‌పై ఎన్‌సీబీ ఫోకస్**

మాణిక్యరెడ్డి అరెస్ట్‌తో కేసులో మరిన్ని కీలక వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆల్ప్రాజోలం తయారీకి ల్యాబ్‌లో ఎలాంటి ఏర్పాట్లు చేశారు, ముడిసరుకు ఎక్కడి నుంచి వచ్చింది, తయారైన డ్రగ్‌ను ఎవరికి అప్పగించాల్సి ఉంది, సరఫరా కోసం ఎలాంటి మార్గాలను ఉపయోగించారు అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలు, డ్రగ్ సరఫరా నెట్‌వర్క్, కేసుతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపైనా అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న రూ.74 కోట్ల విలువైన ఆల్ప్రాజోలం ఈ కేసు తీవ్రతను తెలియజేస్తోంది. విచారణ ముందుకు సాగుతున్న కొద్దీ డ్రగ్ తయారీ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌పై మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.



# గ్యాస్ ఈకేవైసీకి నేటితో గడువు

**ఆదివారం ఎలా చేయాలన్న బెంగ!**

గ్యాస్ ఈకేవైసీ గడువు ఆగస్టు 16 సాయంత్రంతో ముగియనుందన్న సమాచారంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. ఈకేవైసీ పూర్తి చేయకపోతే గ్యాస్ సరఫరాపై ఆంక్షలు ఉండొచ్చని, సబ్సిడీపై ప్రభావం పడొచ్చనే ప్రచారంతో ఏజెన్సీల వద్ద వినియోగదారులు బారులు తీరుతున్నారు. అయితే నేడు ఆదివారం కావడంతో ఏజెన్సీలు పనిచేస్తాయా లేదా అన్న సందేహం నెలకొంది. మరి ఎలా పూర్తి చేసుకోవాలి? అన్న బెంగ చాలామందిలో కనిపిస్తోంది. శనివారం స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో ఇప్పటికే ఒకరోజు సమయం తగ్గిపోయిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆదివారం కూడా ఏజెన్సీలు పనిచేసే అవకాశం ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. పైస్థాయి నుంచి గడువు పొడిగింపుపై ఆదేశాలు వస్తే పరిస్థితి

# రేవంత్ అబద్ధాల ప్రచారం

- కేసీఆర్‌ను తిట్టడమే పని
- సీఎం ప్రసంగంపై హరీశ్ ఫైర్

**రేషన్ కార్డులపైనా మాటల యుద్ధం**



గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇవ్వలేదన్న రేవంత్ వ్యాఖ్యలను హరీశ్‌రావు తప్పుబట్టారు. అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గత ప్రభుత్వం ఆరు లక్షలకు పైగా రేషన్ కార్డులు ఇచ్చిందని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు సంగారెడ్డి వేదికగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నట్లుగా మాట్లాడటం ఎందుకని ప్రశ్నించారు. జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహం ప్రారంభించి ఏడాది పూర్తయినా ఆ రోజు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలయ్యిందా అని నిలదీశారు. సంగారెడ్డి జిల్లాలో మూడేళ్లలో ఒక్క కొత్త రోడ్డు అయినా వేశారా అని ప్రశ్నించారు. “నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారు” అని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు మాత్రమే ఇస్తోందని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీని పిలిచి రెండు లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చిన రేవంత్.. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిలదీత**

విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. రెండేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు అందక కాలేజీలు ఇబ్బందులు పడుతుంటే విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నిరుద్యోగుల సమస్యలపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. రేవంత్‌రెడ్డి గన్‌మెన్లు లేకుండా అశోక్‌నగర్‌కు వచ్చి నిరుద్యోగులను కలవగలరా అని సవాల్ చేశారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు కూడా రేవంత్‌కు లేదని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో వరుసగా మూడేళ్లు రూ.14,656 కోట్లు, రూ.14,721 కోట్లు, రూ.14,721 కోట్ల చొప్పున రైతుబంధు ఇచ్చామని గుర్తుచేశారు. 202425లో రేవంత్ ప్రభుత్వం రూ.5,057 కోట్లు, 202526లో రూ.11 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన దానికంటే రేవంత్ ప్రభుత్వం రూ.15 వేల కోట్లు తక్కువ ఇచ్చిందని విమర్శించారు.

**రుణమాఫీపై సొంతూరి సవాల్**

రైతు రుణమాఫీ విషయంలోనూ హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి సూటి సవాల్ విసిరారు. రేవంత్ తన సొంతూరికి వెళ్లి రైతులను అడిగి రుణమాఫీ నిజంగా జరిగిందో లేదో తెలుసుకోవాలని అన్నారు. తన గ్రామంలోని రైతులందరూ రుణమాఫీ జరిగిందని చెబితే తాను రాజకీయంగా రాజీనామా చేసేందుకు సిద్ధమని హరీశ్‌రావు ప్రకటించారు. అదే రైతులు రుణమాఫీ కాలేదని చెబితే రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. సంగారెడ్డి సభలో సీఎం చేసిన వ్యాఖ్యలకు సమాధానంగా హరీశ్‌రావు రేషన్ కార్డులు, ప్రాజెక్టులు, ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధు, రుణమాఫీ అంశాలను వరుసగా ప్రస్తావించారు. దీంతో స్వాతంత్ర్యదినోత్సవం రోజునే తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది.



# కార్యకర్తలే బలం.. అధికారం ఖాయం

**రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఆగ్రహం**

**కార్యకర్తలే బలం.. అధికారం ఖాయం**

త్వరలో జిల్లాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ప్రతి రోజు పార్టీ కార్యకలాపాలు నిర్వహించి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని నాయకులకు సూచించారు. ఒకప్పుడు టీఆర్ఎస్ కార్యాలయానికి భవనం అద్దెకు ఇవ్వడానికి కూడా కొందరు భయపడేవారని గుర్తుచేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ అందించిన జలదృశ్యం నుంచి పార్టీ ప్రస్థానం ప్రారంభమైందని తెలిపారు. తెలంగాణ భవన్ నిర్మాణానికి 20 ఏళ్లు పూర్తయ్యాయని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి, ప్రజలకు నిరంతరం స్ఫూర్తినివ్వాలన్న కేసీఆర్ ఆలోచనతో ఈ భవనం నిర్మించారని, ఇది తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి వస్తుందని, తెలంగాణ మళ్లీ పట్టాలెక్కుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. జాతి నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

# ఏ కులము నీదంటే.!

- రెండో దశలో క్యాస్ట్ వివరాల నమోదు
- వివరాల నమోదుకు దేశ వ్యాప్త విధానం
- కులం లెక్కలోకి.. జనగణనలో కీలక మార్పు



జనగణన 2027లో కుల వివరాలను అధికారికంగా నమోదు చేయనున్నారు. రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా ఆగస్టు 14న జనాభా లెక్కల రెండో దశకు సంబంధించిన 40 ప్రశ్నలను నోటిఫై చేశారు. 2011 జనగణన ప్రశ్నావళిలో లేని 13 కొత్త డేటా అంశాలను ఈసారి చేర్చారు. జనగణన ప్రక్రియ మొత్తం రెండు దశల్లో సాగుతుంది. మొదటి దశలో హౌసింగ్, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ నిర్వహిస్తారు. రెండో దశలో పాపులేషన్ ఎన్యుమరేషన్ సమయంలో ప్రతి వ్యక్తికి సంబంధించిన జనాభా వివరాలతో పాటు కుల వివరాలను కూడా నమోదు చేయనున్నారు. దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియకు దాదాపు 11 నెలల సమయం పడుతుంది. హౌసింగ్, హౌస్ లిస్టింగ్ దశను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### ఎవరి కులం ఎలా నమోదు చేస్తారు?

రెండో దశలో వ్యక్తుల నుంచి సేకరించే వివరాల్లో కులం కూడా కీలక అంశంగా ఉంటుంది. వ్యక్తి స్వయంగా వెల్లడించే కుల వివరాలను జనగణనలో నమోదు చేసే విధానం అమలు కానుంది. దీంతో దేశంలోని వివిధ సామాజిక వర్గాల సంఖ్య, వారి భౌగోళిక విస్తరణ వంటి అంశాలపై అధికారిక డేటా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. 2011 జనగణనలో సాధారణ జనాభా లెక్కల్లో కుల వివరాల నమోదు జరగలేదు. ఇప్పుడు కులగణనను జనాభా లెక్కల ప్రక్రియలో భాగం చేయడం వల్ల దేశ సామాజిక నిర్మాణంపై విస్తృత స్థాయిలో అధికారిక సమాచారం లభించనుంది. ముఖ్యంగా సంక్షేమ పథకాలు, సామాజిక విధానాలు, రిజర్వేషన్లు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో ఈ డేటా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది.

### 40 ప్రశ్నలు.. 13 కొత్త అంశాలు

కేంద్రం నోటిఫై చేసిన 40 ప్రశ్నల్లో 13 కొత్త డేటా ఫీల్డులు ఉండటం ఈసారి జనగణనలో కీలక మార్పుగా నిలిచింది. జనాభా లెక్కల మొదటి దశ ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో పూర్తయింది. పశ్చిమ బెంగాల్, అసోం, మణిపూర్, త్రిపుర, తమిళనాడు వంటి కొన్ని రాష్ట్రాల్లో మాత్రం హౌసింగ్ దశ మిగిలి ఉంది. రెండో దశలో జనాభా వివరాల సేకరణ పూర్తయిన తర్వాత దేశంలోని సామాజిక పరిస్థితిపై మరింత విస్తృతమైన అధికారిక డేటా అందుబాటులోకి రానుంది. కులగణనను జనగణనలో చేర్చడం వల్ల ఏ వర్గానికి ఎంత జనాభా ఉంది? సామాజికంగా ఎవరు వెనుకబడి ఉన్నారు? ప్రభుత్వ విధానాలు ఎవరికి ఎంత మేర చేరుతున్నాయి? వంటి అంశాలపై భవిష్యత్తులో మరింత స్పష్టమైన చర్చకు అవకాశం ఏర్పడనుంది.

# ఆఫర్ ఉంది.. ఉద్యోగం ఎప్పుడు?

- విప్రో ఆన్‌బోర్డింగ్ ఆలస్యంపై ఫిర్యాదులు
- 200 మందికి పైగా యువత ఎదురుచూపు



ఐటీ దిగ్గజం విప్రోలో ఉద్యోగం కోసం ఎంపికైన 200 మందికి పైగా విద్యార్థులు, యువ ఇంజనీర్లు నెలల తరబడి ఎదురుచూస్తున్నారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. విప్రో ఎలైట్ హైరింగ్ 2025 ప్రక్రియలో ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటికీ స్పష్టమైన జాయినింగ్ తేదీ ఇవ్వలేదని ముంబైకి చెందిన నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (నైట్స్) ఆరోపించింది. ఈ అంశంపై కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు సంస్థ లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. అభ్యర్థులు 2025 ఫిబ్రవరి 1న క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొని, అదే నెలలో తదుపరి దశలను పూర్తి చేశారని నైట్స్ తెలిపింది. జూలై 22, 2025న ఆఫర్ లెటర్లు, ఆగస్టులో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ అందుకున్నారని పేర్కొంది.

### అన్నీ పూర్తి చేసినా.. జాయినింగ్ లేదు

నైట్స్ వివరాల ప్రకారం.. 2025 డిసెంబర్‌లో కూడా అభ్యర్థులు విప్రో అధికారిక సర్వే ద్వారా తమ ఆసక్తిని మరోసారి ధృవీకరించారు. కంపెనీ కోరిన అన్ని ప్రక్రియలను పూర్తి చేసినా ఇప్పటివరకు ఖచ్చితమైన ఆన్‌బోర్డింగ్ తేదీ ఇవ్వలేదని సంస్థ ఆరోపించింది. పలుమార్లు విప్రో హెచ్‌ఆర్, ఆన్‌బోర్డింగ్ హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించినా స్పష్టమైన సమాధానం రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. విద్యాసంస్థలు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు కూడా కంపెనీతో సంప్రదించి వివరాలు కోరినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపింది. దీంతో ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో ఇతర అవకాశాలను వదులుకున్నామని పలువురు అభ్యర్థులు చెబుతున్నారని నైట్స్ పేర్కొంది. ఉద్యోగం కోసం ఎదురుచూస్తూ కుటుంబ ఆర్థిక బాధ్యతలు, విద్యా ఖర్చులు, వసతి ఖర్చులు పెరగడంతో యువత తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొంటోందని తెలిపింది.

### విప్రో ఏమంటోంది?

ఈ ఆరోపణలపై విప్రో తన స్పందనను కూడా వెల్లడించింది. ఎంపికైన ఫ్రెషర్లను వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఆన్‌బోర్డ్ చేసేందుకు సంస్థ కట్టుబడి ఉందని విప్రో ప్రతినిధి తెలిపారు. తదుపరి వివరాలను అభ్యర్థులకు తెలియజేస్తూనే ఉంటామని చెప్పారు. అయితే నైట్స్ మాత్రం సమస్యను అత్యవసరంగా పరిగణించి కార్మిక శాఖ జోక్యం చేసుకోవాలని కోరింది. యువత తమ కెరీర్‌ను ప్రారంభించే కీలక సమయంలో ఉద్యోగంపై ఆధారపడి ప్రణాళికలు, ఆర్థిక నిర్ణయాలు తీసుకున్నారని సంస్థ పేర్కొంది. జాయినింగ్ తేదీపై స్పష్టత లేకపోవడం వల్ల ప్రత్యామ్నాయ ఉద్యోగాలు, ఉన్నత విద్యపై నిర్ణయం తీసుకోలేకపోతున్నారని తెలిపింది. మొత్తంగా ఆఫర్ లెటర్ చేతిలో ఉన్నా ఉద్యోగంలో చేరే తేదీ తెలియని పరిస్థితి యువతలో ఆందోళనకు కారణమైంది. కార్మిక శాఖ జోక్యంతో ఈ వివాదానికి త్వరగా పరిష్కారం లభిస్తుందా అన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.



# కూకట్‌పల్లిలో స్వాతంత్ర్య వేడుకలు

కూకట్‌పల్లిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మైత్రినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికురాలు ప్రియదర్శిని తన భర్త లేట్ కిరణ్ కుమార్ జ్ఞాపకార్థం, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని చిన్నారులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, విద్యా కిట్లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ చేతుల మీదుగా అందించారు. విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, నాయకులు తులసీరావు, రాజేష్ కుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రభాకర్, పవన్, బొట్టు విష్ణు, మాణిక్యం, సంతోష్ యాదవ్, మేకల నర్సింగరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా కోటా.. క్రెడిట్ మీకే!

- విపక్షాలకు మోదీ కీలక విజ్ఞప్తి
- మహిళలకు 33 శాతం హక్కు



80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీ కీలక రాజకీయ పిలుపునిచ్చారు. పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలును రాజకీయ పోరుగా మార్చకుండా అన్ని పార్టీలు కలిసి ముందుకు రావాలని కోరారు. మహిళా రిజర్వేషన్ అంశం రాజకీయ విభేదాల కారణంగా దాదాపు 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని మోదీ పేర్కొన్నారు. "మహిళలకు వారి హక్కు కల్పించండి.. క్రెడిట్ మీరే తీసుకోండి" అన్న సందేశంతో విపక్షాలను నేరుగా ఉద్దేశించారు. తల్లులు, సోదరీమణులకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లభిస్తే దేశ విధానాల రూపకల్పనలో వారి పాత్ర మరింత పెరుగుతుందని చెప్పారు. మహిళా సాధికారతను రాజకీయ లాభనష్టాలకతీతంగా చూడాలని మోదీ పిలుపునిచ్చారు.

### 'దిమాగీ నక్సల్స్'పై హెచ్చరిక

దేశంలో సాయుధ నక్సలిజాన్ని అణచివేయడంలో విజయం సాధించామని ప్రధాని చెప్పారు. అయితే సాయుధ నక్సల్స్ వెళ్లిపోయినా.. 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారని హెచ్చరించారు. మావోయిస్టు భావజాలం ఉన్న కొందరు వ్యక్తులు దశాబ్దాలుగా అధికార వ్యవస్థలోని కీలక ప్రాంతాల్లో పాతుకుపోయారని ఆరోపించారు. దేశాన్ని తప్పుదారి పట్టించేందుకు వారు వివిధ మార్గాలను ఉపయోగించే అవకాశం ఉందని అన్నారు. అలాంటి భావజాలాన్ని గుర్తించి దూరం పెట్టాలని, యువతను దేశ నిర్మాణం వైపు నడిపించాలని పిలుపునిచ్చారు. గతంలో 'అర్బన్ నక్సల్స్' అనే పదాన్ని ఉపయోగించిన మోదీ.. ఈసారి 'దిమాగీ నక్సల్స్' అనే పదాన్ని ప్రస్తావించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

### 2047 లక్ష్యం.. ఏడు రంగాలపై ఫోకస్

75 నిమిషాల ప్రసంగంలో మోదీ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా యువత నాయకత్వం చేపట్టాలని పిలుపునిచ్చారు. తయారీ, విద్యుత్, వ్యవసాయం-ఆహార ప్రాసెసింగ్, టెక్నాలజీ-ఇన్నోవేషన్, రవాణా మౌలిక వసతులు, రక్షణ రంగం, గ్రీన్-బ్లూ ఎకానమీ, సాఫ్ట్ పవర్ వంటి రంగాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలపై కోచింగ్ ఖర్చుల భారం తగ్గించేందుకు వివిధ పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించే కార్యక్రమాన్ని ప్రకటించారు. 2036 ఒలింపిక్స్‌కు భారత్ బలమైన పోటీదారుగా ఉందని చెబుతూ 5 నుంచి 15 ఏళ్ల పిల్లల్లో క్రీడా ప్రతిభను గుర్తించేందుకు దేశవ్యాప్త టాలెంట్ హంట్ చేపడతామని తెలిపారు. ఇంధన స్వావలంబన, అణు విద్యుత్, రక్షణ తయారీ రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ నుంచి 'దిమాగీ నక్సల్స్' వరకు.. యువత నుంచి 2047 అభివృద్ధి భారత్ వరకు మోదీ ప్రసంగం పలు కీలక అంశాలను టచ్ చేసింది.

# ఏది నిజం.. ఎవరు నిజం?



- వందేమాతరంపై మళ్లీ రగడ!
- ఒకే దృశ్యం.. రెండు భిన్న అర్థాలు
- సోనియా సంకేతాలు.. బీజేపీ ఆరోపణలు

స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశభక్తి గీతం చుట్టూ మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో వందేమాతరం పూర్తి ఆరు చరణాలతో ఆలపించిన వేళ సోనియా గాంధీ చేసిన కొన్ని సంకేతాలు ఇప్పుడు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వైపు చూపించడం, అనంతరం సేవాదళ్ నేతలతో మాట్లాడటం కనిపించడంతో బీజేపీ తీవ్ర ఆరోపణలకు దిగింది. పూర్తి వందేమాతరాన్ని అడ్డుకునేందుకు సోనియా ప్రయత్నించారని బీజేపీ విమర్శిస్తే.. కాంగ్రెస్ మాత్రం ఆ ఆరోపణలను పూర్తిగా ఖండిస్తోంది. ఖర్గే చాలాసేపు నిల్చొని ఉండటంతో ఆయనకు కుర్చీ ఏర్పాటు చేయాలని మాత్రమే సోనియా సూచించారని వివరణ ఇచ్చింది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలైంది. ఒకే దృశ్యం.. రెండు భిన్న అర్థాలు! పైగా వందేమాతరంపై కేంద్రం ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలు, జాతీయ గౌరవానికి సంబంధించిన చట్ట సవరణలు ఈ వివాదానికి మరింత ప్రాధాన్యం తెచ్చాయి. పాటను పూర్తిగా ఆలపించారా లేదా అన్న విషయంలో పెద్దగా భేదాభిప్రాయం లేకపోయినా.. సోనియా సంకేతాల అసలు ఉద్దేశం ఏమిటన్నదే ఇప్పుడు రాజకీయ రగడకు కేంద్రబిందువైంది. దేశభక్తి గీతం రాజకీయ విమర్శలకు ఆయుధంగా మారిందా? లేక సాధారణ సూచనకే రాజకీయ రంగు పులిమారా? అసలు ఏది నిజం.. ఎవరు నిజం?

కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో పూర్తి ఆరు చరణాల వందేమాతరం ఆలాపన సందర్భంగా సోనియా గాంధీ చేసిన సంకేతాలపై రాజకీయ రగడ మొదలైంది. జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలో సోనియా గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వైపు సంకేతాలు ఇవ్వడం, అనంతరం సేవాదళ్ నేతలతో మాట్లాడటం కనిపించింది. రాహుల్ గాంధీ కూడా వారితో చర్చిస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. దీనినే బీజేపీ ప్రధాన అస్త్రంగా మార్చుకుంది. బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది సోనియా గాంధీ పూర్తి వందేమాతరాన్ని ఆపేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం వ్యవహరించిన తీరు దేశానికి అవమానకరమని విమర్శించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ మరోవైపు వందేమాతరాన్ని పూర్తి రూపంలో ఆలపించడం దేశభక్తి, జాతీయ గౌరవానికి సంబంధించిన అంశంగా ప్రస్తావిస్తోంది.

### కాంగ్రెస్ వివరణ.. ఖర్గే కోసం కుర్చీ

బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేశ్ ప్రకారం.. సోనియా గాంధీ వందేమాతరాన్ని ఆపాలని ఎలాంటి సంకేతం ఇవ్వలేదు. చాలాసేపు నిలబడి ఉన్న మల్లికార్జున్ ఖర్గే కోసం కుర్చీ ఏర్పాటు చేయాలని ఆమె కోరినట్లు వివరించారు. ఇందిరా భవన్‌లో పూర్తి వందేమాతరం ఆలపించామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వాదనకు చారిత్రక నేపథ్యాన్ని కూడా జోడించారు. 1937లో మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్, నెహ్రూ, మౌలానా ఆజాద్ వంటి నేతలు పాల్గొన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ సూచన మేరకు ప్రారంభ చరణాలను మాత్రమే ఆలపించే నిర్ణయం తీసుకున్నారని జైరాం రమేశ్ తెలిపారు. ఆ చారిత్రక నిర్ణయాన్ని ఇప్పుడు తప్పుగా అర్థం చేసుకోవద్దని కాంగ్రెస్ చెబుతోంది. పార్లమెంట్‌లో వందేమాతరంపై చట్ట సవరణ జరిగిన సమయంలో కూడా తమ పార్టీ అభ్యంతరాలను వివరించిందని ఆయన పేర్కొన్నారు.

### చట్టం మారింది.. అందుకే వివాదం

ఈ వివాదం సాధారణ రాజకీయ ఆరోపణల స్థాయిని దాటి ప్రాధాన్యం సంతరించుకోవడానికి ఇటీవల మారిన చట్టపరమైన పరిస్థితులే ప్రధాన కారణం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఫిబ్రవరిలో వందేమాతరం ఆలాపనపై మార్గదర్శకాలు జారీ చేసింది. జూలైలో వాటిని మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వ కార్యక్రమాలు, రాష్ట్ర స్థాయి ముఖ్యమైన సందర్భాల్లో పూర్తి ఆరు చరణాల అధికారిక వందేమాతరం ఆలపించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. రాష్ట్రపతి రాక, జాతీయ జెండా ఆవిష్కరణ, గవర్నర్ల ప్రసంగాలు, అధికారిక కార్యక్రమాలు వంటి సందర్భాల్లో పూర్తి రూపాన్ని ఆలపించాలని సూచించారు. జూలై 30న లోక్‌సభ ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ సవరణ యాక్ట్ 2026ను ఆమోదించింది. వందేమాతరం ఆలాపనను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, నిలిపివేయడం నేరంగా పరిగణించే నిబంధనలు చట్టంలోకి వచ్చాయి. వందేమాతరానికి జనగణమనతో సమానమైన హోదా కల్పించడంతో ప్రస్తుత వివాదం మరింత సున్నితంగా మారింది. అయితే కాంగ్రెస్ కార్యాలయంలో పాట పూర్తిగా ఆలపించబడిన విషయం రెండు వర్గాలూ అంగీకరిస్తున్నాయి. అసలు వివాదం మాత్రం సోనియా గాంధీ చేసిన సంకేతాల అర్థంపై ఉంది. బీజేపీ దాన్ని వందేమాతరం వ్యతిరేకతగా చూస్తుంటే.. కాంగ్రెస్ దాన్ని ఖర్గేకు కుర్చీ కోసం చేసిన సంకేతంగా వివరిస్తోంది. దీంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుక మరోసారి దేశ రాజకీయాల్లో మాటల యుద్ధానికి కేంద్రంగా మారింది.

# మాది మాకిచ్చేయండి

- అబ్దుల్లా డబుల్ సందేశం
- పీవోకేపై సంచలన వ్యాఖ్యలు



జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఒకే మాటతో రెండు రాజకీయ సందేశాలు ఇచ్చారు. ఒకవైపు 2019 తర్వాత జమ్మూకశ్మీర్‌కు దూరమైన హక్కులను తిరిగి ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. "మా దగ్గర్నుంచి తీసుకున్నది మాకు తిరిగి ఇవ్వండి" అంటూ రాష్ట్ర హోదా, రాజ్యాంగపరమైన హక్కులు, ఫెడరలిజం అంశాలను ముందుకు తెచ్చారు. మరోవైపు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ పరిస్థితిని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తి రేపాయి. "వాళ్లు మన సొంత ప్రజలు" అంటూ పీవోకే ప్రజల కోసం జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో స్థానాలు కేటాయించి ఉన్నాయని గుర్తుచేశారు. 2019 పరిణామాలు జరగకపోయి ఉంటే.. పీవోకే ప్రజలు ఈ వైపు కలవాలని ఉద్యమించేవారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అసాధారణంగా నిలిచాయి. అంటే.. తమ హక్కులు పూర్తిగా పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో పాటు కశ్మీర్ అవతలి భాగంపైనా రాజకీయ హక్కును గుర్తుచేసేలా ఒమర్ మాట్లాడారు. ఒకే ప్రసంగంలో అంతర్గత హక్కుల నుంచి పీవోకే భవిష్యత్తు వరకు చర్చను తీసుకెళ్లడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లో జాతీయ జెండా ఎగురవేసిన జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 2019 నిర్ణయాలను మరోసారి ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్ నుంచి గతంలో తీసుకున్న హక్కులను తిరిగి ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఆర్టికల్ 370 పేరును నేరుగా ప్రస్తావించకుండానే "మా దగ్గర్నుంచి తీసుకున్నది మాకు తిరిగి ఇవ్వాలి" అంటూ తన డిమాండ్‌ను స్పష్టం చేశారు. కేవలం రాష్ట్ర హోదా పునరుద్ధరణ సరిపోదని, రాష్ట్రాలకు అధికారాలు కల్పించడమే నిజమైన ఫెడరలిజమని అన్నారు. కేంద్ర సంస్థలు రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశాల్లో జోక్యం చేసుకోవడం, రాష్ట్రాల అధికారాలను క్రమంగా తగ్గించడం సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తుందని వ్యాఖ్యానించారు. 2019కు ముందు ఉన్న హక్కులు, రాజ్యాంగపరమైన హామీల పునరుద్ధరణ కోసం తమ ప్రభుత్వం పోరాడుతుందని ఒమర్ స్పష్టం చేశారు.

### పీవోకే ప్రజలు మనవాళ్లే!

ఇదే ప్రసంగంలో ఒమర్ అబ్దుల్లా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ పరిస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పీవోకేలో జరుగుతున్న నిరసనల్లో పలువురు మరణించడం, గాయపడటం, అరెస్టవడం బాధాకరమని అన్నారు. "వాళ్లు మన సొంత ప్రజలు" అని పేర్కొంటూ.. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో పీవోకే ప్రాంత ప్రజల కోసం స్థానాలు కేటాయించి ఉన్నాయని గుర్తుచేశారు. 2019లో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్ర హోదా తొలగించకపోయి ఉంటే పీవోకే ప్రజలు ఈ వైపు కలవాలని ఉద్యమించేవారని ఆయన వ్యాఖ్యానించారు. పీవోకేలో ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితులు 1947లో పాకిస్థాన్ గిరిజన దాడులను ఎదుర్కొని భారత్‌లో విలీనం కావాలని కశ్మీరీలు తీసుకున్న నిర్ణయం సరైనదేనని నిరూపిస్తున్నాయని అన్నారు. షేక్ మహ్మద్ అబ్దుల్లా నాయకత్వంలో జరిగిన ఆ పోరాటాన్ని స్మరించుకున్నారు. ఒకరోజు పీవోకేకు కేటాయించిన అసెంబ్లీ స్థానాలు భర్తీ అవుతాయనే ఆశను కూడా వ్యక్తం చేశారు.

### బీజేపీ కౌంటర్.. రాజకీయ ప్రసంగమా?

ఒమర్ వ్యాఖ్యలపై జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ప్రతిపక్ష నేత సునీల్ శర్మ తీవ్రంగా స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ సందర్భాన్ని రాజకీయ ప్రసంగానికి ఉపయోగించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. జాతీయ జెండా ముందు దేశ భవిష్యత్తు, ప్రభుత్వ పనితీరు గురించి మాట్లాడాల్సిన సమయంలో పాత రాజకీయ అంశాలను ప్రస్తావించడం సరికాదని అన్నారు. అయితే ఒమర్ మాత్రం తన వైఖరిలో వెనక్కి తగ్గలేదు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ, రాజ్యాంగ హామీల సాధన, ఫెడరలిజం బలోపేతం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని చెప్పారు. పీవోకే ప్రజల సమస్యలను ప్రస్తావించడం కూడా కశ్మీర్ చరిత్ర, ప్రస్తుత పరిస్థితులతో ముడిపడి ఉన్న అంశంగానే ఆయన వివరించారు. దీంతో స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై నుంచి ఒమర్ చేసిన వ్యాఖ్యలు 2019కు ముందు జమ్మూకశ్మీర్ హక్కుల పునరుద్ధరణ నుంచి పీవోకే ప్రజల భవిష్యత్తు వరకు మరోసారి రాజకీయ చర్చను రగిలించాయి. ఒకవైపు "తీసుకున్నది తిరిగి ఇవ్వాలి" అన్న ఒమర్ డిమాండ్.. మరోవైపు "జాతీయ దినోత్సవాన్ని రాజకీయాలకు వాడొద్దు" అన్న బీజేపీ కౌంటర్.. కశ్మీర్ రాజకీయాల్లో కొత్త వాదనకు తెరలేపాయి.

# అనుమతులు లేకుండా నిర్వహణ

- శ్రీకిరణ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీకిరణ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం శ్రీ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో తల్లిదండ్రులను మభ్యపెట్టి, గతంలో రూ.10 వేలుగా ఉన్న ఫీజును రూ.30 వేలకు పెంచి అడ్మిషన్లు నిర్వహించిందని ఆరోపించారు. అనుమతులు లేకుండా ఇంటర్నేషనల్ పేరును ఉపయోగించడంపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించి ఆ పేరును తొలగించారని తెలిపారు. అయితే 202627 విద్యా సంవత్సరానికి అదే పేరుతో ఫీజులు వసూలు చేసి అడ్మిషన్లు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం శ్రీ కిరణ్ టెక్నో స్కూల్ పేరును కూడా ఉపయోగిస్తున్నారని, దానిని తొలగించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని సతీష్ హెచ్చరించారు.




# బీసీఐకి నల్సార్ విద్యార్థుల కౌంటర్

- ఎన్‌రోల్‌మెంట్ ఆపే అధికారం ఎవరిచ్చారు?
- మొత్తం బ్యాచ్‌ను ఎలా ఆపుతారంటూ ధ్వజం

నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్టూడెంట్ బార్ కౌన్సిల్ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చర్యలను తీవ్రంగా వ్యతిరేకించింది. 2026లో చదువు పూర్తి చేసిన మొత్తం విద్యార్థుల బ్యాచ్ ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లోనూ నమోదు కాకుండా అడ్డుకునేలా బీసీఐ చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా ఇచ్చిన ఆదేశాలను తప్పుబట్టింది. ఆగస్టు 13న జరిగిన పరిణామాలపై ఆగస్టు 14 అర్ధరాత్రి తర్వాత విద్యార్థి బార్ కౌన్సిల్ ప్రకటన విడుదల చేసింది. బీసీఐ ప్రస్తావించిన అడ్వకేట్స్ యాక్ట్ నిబంధనలు మొత్తం బ్యాచ్ ఎన్‌రోల్‌మెంట్‌ను నిలిపివేసే అధికారాన్ని ఇవ్వవని స్పష్టం చేసింది. పార్లమెంట్ చట్టంలో లేని కొత్త అర్హతలు, ఆంక్షలను నిబంధనల పేరుతో విధించలేరని వాదించింది.

### సమ్మె తీర్పును ఎందుకు తెచ్చారు?

బీసీఐ తన చర్యలకు 2002లో సుప్రీంకోర్టు ఇచ్చిన మాజీ కెప్టెన్ హరీశ్ ఉప్పాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పును ప్రస్తావించడాన్ని కూడా నల్సార్ విద్యార్థులు ప్రశ్నించారు. న్యాయవాదులకు కోర్టుల బహిష్కరణ, సమ్మెకు హక్కు లేదని ఆ తీర్పు చెప్పినప్పటికీ.. దాన్ని మొత్తం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ఆంక్షలకు ఆధారంగా చూపడం సరికాదని అన్నారు. అడ్వకేట్స్ యాక్ట్‌లోని సెక్షన్ 49 కేవలం నిబంధనలు రూపొందించే అధికారం ఇచ్చే నిబంధన మాత్రమేనని, అది స్వతంత్రంగా కొత్త ఆంక్షలు, అర్హతలు, నిషేధాలు విధించే అధికారాన్ని ఇవ్వదని స్టూడెంట్ బార్ కౌన్సిల్ పేర్కొంది. విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, పరిశోధకులు, బయట నుంచి పాల్గొన్న వ్యక్తుల గుర్తింపును సేకరించే ప్రతిపాదనపై గోప్యతా హక్కు అంశాన్ని కూడా లేవనెత్తింది.

### నిరసన హక్కును అణచలేరన్న వాదన

నల్సార్ విద్యార్థులు తమ వాదనను రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛతో ముడిపెట్టారు. శాంతియుత నిరసన, అధికారాన్ని ప్రశ్నించడం రాజ్యాంగ విరుద్ధం కాదని, విశ్వవిద్యాలయాలు స్వతంత్ర ఆలోచనను కాపాడాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. రాజ్యాంగ విధేయత అంటే మౌనంగా ఉండటం కాదని తేల్చిచెప్పారు. బీసీఐ చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా ఉపయోగించిన భాషపై కూడా విద్యార్థి సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. నల్సార్ కమ్యూనిటీ సభ్యుల పట్ల ఉపయోగించిన భాషకు మిశ్రా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం, రాజ్యాంగం అందించిన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యపరమైన విభేదించే హక్కును ప్రస్తావిస్తూ ప్రకటన ముగించింది. మొత్తం మీద నల్సార్ విద్యార్థి బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేతకు చట్టబద్ధ ఆధారం లేదని, నిరసన హక్కును అణచలేరని స్పష్టమైన సందేశం ఇచ్చింది.

## సంపాదకీయం



# హుందాతనం కోల్పోతున్న రాహుల్ గాంధీ!

రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారిపోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధానమంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్దనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధాన మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మరింతగా దిగజారిన నేతగా ప్రజల్లో చులకన భావం మూటకట్టుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తి నిజసానికి ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడు. ఇక ప్రధానిగా కావాలనుకంటున్న ఇతనికి వందిమాగధులు చేస్తున్న పొగడ్తలతో ఉబ్బిపోవడం తప్ప మరోటి తెలియడం లేదు. స్వయం ప్రకటితంగా ఇక తానే భావి ప్రధాని అనుకోవడంతో వచ్చిన మానసిక వైకల్యంగా చూడాలి. వీటిని అధిగమించితే తప్ప సమర్థనేతగా రాహుల్ రాణించడం కష్టం.

# వికసిత భారత్‌కు 'సప్తధార'!

- ప్రపంచ నాయకత్వమే భారత్ లక్ష్యం
- తయారీ నుంచి రక్షణ దాకా ఏడు రంగాలపై గురి
- యువశక్తి.. సాంకేతికతతో సరికొత్త ప్రగతి పథం
- జనగణనలో కచ్చితమైన సమాచారమివ్వాలని పిలుపు
- స్వయం సమృద్ధితో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్
- ఎర్రకోట నుంచి భవిష్యత్ భారతానికి మోదీ దిశానిర్దేశం





**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ప్రపంచస్థాయి నాయకత్వం వహించే శక్తి, సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తయారీ నుంచి వ్యవసాయం వరకు, సాంకేతికత నుంచి రక్షణ వరకు ప్రతి రంగంలోనూ ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి దేశాన్ని తీసుకెళ్లడమే లక్ష్యమని ప్రకటించారు. 2047 నాటికి సంపూర్ణ స్వయంసమృద్ధితో కూడిన 'వికసిత భారత్' నిర్మాణానికి 'సప్తధార' పేరుతో ఏడు కీలక రంగాల కార్యాచరణను దేశం ముందుంచారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై వరుసగా 13వసారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మోదీ జాతినుద్దేశించి ప్రసంగించారు. భారత్ ఇక చిన్న లక్ష్యాలతో సంతృప్తి చెందే దేశం కాదని, పెద్ద కలలు.. ఉన్నత లక్ష్యాలతో ప్రపంచానికి దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. దేశ యువతకు కృత్రిమ మేధ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు భారీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మోదీ ప్రకటించారు. కోటి మంది యువతకు కృత్రిమ మేధ నైపుణ్యాల్లో శిక్షణతో పాటు పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు యువతకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు.

### జనగణనకు ఓ గంట ఇవ్వండి

దేశంలో జరుగుతున్న జనగణనలో యువత చురుగ్గా భాగస్వాములు కావాలని ప్రధాని కోరారు. "దేశం కోసం ఒక గంట లేదా రెండు గంటలు కేటాయించండి. ప్రతి ఇంట్లో జనగణనపై అవగాహన కల్పించండి" అని పిలుపునిచ్చారు. జనగణన కేవలం జనాభా లెక్కల ప్రక్రియ కాదని, ప్రజలు ఇచ్చే సమాచారం ఆధారంగానే భవిష్యత్ జాతీయ విధానాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందుతాయని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ కచ్చితమైన సమాచారం ఇవ్వాలని కోరారు.

### దేశ ప్రగతికి ఏడు ధారలు

వికసిత భారత్ నిర్మాణానికి తయారీ, వ్యవసాయం–ఆహార భద్రత, సాంకేతికత–ఆవిష్కరణలు, మౌలిక వసతులు, రక్షణ, హరిత–నీలి ఆర్థిక వ్యవస్థ, భారతీయ సాంస్కృతిక ప్రభావం అనే ఏడు రంగాలను 'సప్తధార'గా ప్రధాని ప్రకటించారు. తయారీ రంగంలో కేవలం విడిభాగాల ఉత్పత్తికి పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తులను భారత్‌లోనే తయారు చేయాలని పిలుపునిచ్చారు. ధర, నాణ్యత, భారీ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలక భాగస్వామిగా ఎదగాలన్నారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడంతో పాటు దీర్ఘకాలిక ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. సాంకేతిక రంగంలో డేటా కేంద్రాలు, రోబోటిక్స్, కృత్రిమ మేధ వంటి అత్యాధునిక రంగాల్లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించాలని మోదీ స్పష్టం చేశారు. డ్రోన్లు, ప్రతిదాడి డ్రోన్ వ్యవస్థలు సహా అత్యాధునిక రక్షణ సాంకేతికతలను దేశీయంగా అభివృద్ధి చేయాలని సూచించారు. దేశ భద్రతకు స్వయం సమృద్ధ రక్షణ వ్యవస్థ అత్యంత కీలకమన్నారు. హరిత ఇంధనం, అణు విద్యుత్, సౌరశక్తి, హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై భారత్ మరింత వేగంగా ముందుకు సాగుతుందని చెప్పారు. వంద గిగావాట్ల అణు ఇంధన సామర్థ్యాన్ని సాధించడం లక్ష్యమన్నారు.

### చిప్ నుంచి హైడ్రోజన్ రైలు వరకు

సాంకేతిక ప్రపంచంలో సెమీకండక్టర్ చిప్‌ల ప్రాధాన్యాన్ని భారత్ గుర్తించిందని మోదీ పేర్కొన్నారు. ఇప్పటికే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో మరిన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని, రైల్వే విద్యుదీకరణను వేగంగా విస్తరించామని తెలిపారు. దేశంలో 50 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.

### 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు

తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని పేర్కొన్నారు. 140 కోట్ల మంది భారతీయులు ఒకే సంకల్పంతో ముందుకు సాగితే దేశ ప్రగతిని ఎవరూ అడ్డుకోలేరన్నారు. స్థానిక ఉత్పత్తులను ఆదరించడం ద్వారా స్వదేశీ తయారీకి మరింత బలం చేకూర్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి మహిళా ప్రాతినిధ్యానికి సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. రాజకీయ ఘనత ఎవరు తీసుకున్నా అభ్యంతరం లేదని, మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

### ఎర్రకోటపై మువ్వన్నెల రెపరెపలు

అంతకుముందు రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులర్పించిన ప్రధాని మోదీ ఎర్రకోటకు చేరుకుని గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాయుసేన హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై మోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం వరుసగా 13వసారి.

### వేడుకలకు రాహుల్, ఖర్గే దూరం

ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. గతంలో సీటింగ్, ఇతర ప్రొటోకాల్ అంశాలపై కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో వారి గైర్హాజరు మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది.

# పాక్ ఉగ్రవాద సంస్థతో లింకులు

### బెంగుళూరులో బెంగాల్ యువకుడి అరెస్ట్





**బెంగళూరు, ఆగస్ట్ 15:** బెంగళూరులో అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ 25 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడికి ఉగ్రవాద సంస్థ తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర పరగణాల జిల్లాకు చెందిన అసఫుల్ మల్లిక్ బెంగళూరులోని జిగణి పారిశ్రామిక ప్రాంతంలోని ఓ సంస్థలో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నాడు. బొమ్మసంద్ర పారిశ్రామిక ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక వ్యక్తి అనుమానాస్పద కార్యకలాపాల గురించి పోలీసులకు సమాచారం అందింది. దీంతో మల్లిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ÷ాకిస్థాన్ సైన్యం ముస్లింలపై దాడులకు పాల్పడుతోందనే భావనతో తాను ఆగ్రహానికి గురైనట్లు మల్లిక్ చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. అదే సమయంలో, ఇజ్రాయెల్–పాలస్తీనా వివాదంలో పాకిస్థాన్ వైఖరిపైనా అతడు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. భారతదేశంలో ముస్లింలకు ఇబ్బందులు ఎదురైతే ప్రతీకారం తీర్చుకోవాలని అతడిని ప్రేరేపించినట్లు కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ÷ేస్‌బుక్ ద్వారా అఎ÷–గానిస్థాన్‌కు చెందిన ఇమ్రాన్ హైదర్ అనే వ్యక్తితో మల్లిక్ పరిచయం పెంచుకున్నట్లు వెల్లడైంది. అఎ÷–గాన్‌కు చెందిన టీటీపీ ఉగ్రసంస్థ హ్యాండ్లర్లతో అతడు తరచూ సంప్రదింపులు జరుపుతున్నట్టు తేలింది. భారత్, పాకిస్థాన్‌లో దాడులకు వారు ప్రణాళికలు రచించినట్టు తెలుస్తోంది. అఎ÷–గాన్‌కు వెళ్లి ఉగ్రసంస్థలో చేరడానికి కూడా అతడు సిద్ధమవుతున్నట్టు పోలీసులు గుర్తించారు.



# టీహెచ్‌డీసీ సొరంగ ప్రమాదం

### ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య

**ఉత్తరాఖండ్:** చమోలి జిల్లా పిపల్‌కోటిలోని టీహెచ్‌డీసీ సొరంగంలో నిన్న (శుక్రవారం) భారీ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బిర్హి నది సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న సొరంగంలోకి పెద్దఎత్తున వరదనీరు, శిథిలాలు వచ్చి చేరాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారి కోసం సహాయక బృందాలను అధికారులు రంగంలోకి దించారు. నిన్నటి నుంచి భారీగా చేరిన నీరు, శిథిలాలను తొలగిస్తూ.. నేడు మరో మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. మరోవైపు, శిథిలాల కింద చిక్కుకుపోయిన మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈరోజు ఉదయం స్పందించారు. టీహెచ్‌డీసీ సొరంగంలోకి అకస్మాత్తుగా శిథిలాలు, నీరు చేరడంతో విధుల్లో ఉన్న కార్మికులు చిక్కుకుపోయారని తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతిచెందగా.. చిక్కుకుపోయిన కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వ జిల్లా యంత్రాంగంతో సహా అన్ని ఏజెన్సీలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, ఈ ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని తెలుసుకునేందుకు సమగ్ర దర్యాప్తు జరుగుతోందని సీఎం పుష్కర్ సింగ్ ధామి చెప్పారు. ఏ నిర్మాణ ప్రాజెక్టులోనైనా పని చేసే సిబ్బంది భద్రతే తొలి ప్రాధాన్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారమే ఆదేశాలు జారీ చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కాగా, సొరంగం లోపల భారీగా చేరిన నీరు, బురద కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు చెబుతున్నారు.

# సప్తధారతో వికసిత్ భారత్‌కు బాటలు

(మొదటి పేజీ తరువాయి..)

### సప్తధారే దేశ అభివృద్ధి మంత్రం

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక వసతులు, రక్షణ, హరిత ఇంధనం, భారత సాఫ్ట్ పవర్‌ను దేశ ప్రగతికి ప్రధాన ఆధారాలుగా పేర్కొన్నారు. ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్ ఎదగాలని, వ్యవసాయంలో ఉత్పాదకత పెంచాలని సూచించారు. డేటా సెంటర్లు, రోబోటిక్స్, స్వదేశీ 6జీ వంటి రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని ఆకాంక్షించారు. హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, గతి శక్తి ద్వారా వేగవంతమైన మౌలిక వసతులు, రక్షణ రంగంలో స్వదేశీ తయారీ, డ్రోన్ సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ, యోగా, సినిమా, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, పర్యాటక రంగాలను సాఫ్ట్ పవర్‌కు బలమైన ఆయుధాలుగా అభివర్ణించారు.

### స్వయం సమృద్ధే అసలైన లక్ష్యం

దేశం చిన్న లక్ష్యాలతో ముందుకు వెళ్లే పరిస్థితి లేదని మోదీ స్పష్టం చేశారు. ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించడమే భారత్ ముందున్న ప్రధాన లక్ష్యమని చెప్పారు. సెమీకండక్టర్ ప్లాంట్లు, హైడ్రోజన్ రైలు, రైల్వే విద్యుదీకరణ, సౌర విద్యుత్, అణు ఇంధన సామర్థ్యంపై ప్రభుత్వం దృష్టి పెడుతోందని తెలిపారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. ఇదే సమయంలో సాయుధ నక్సలిజం తగ్గినా 'దిమాగీ నక్సల్స్' పేరుతో కొత్త ఆలోచనా విధానాలు సమాజాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని హెచ్చరించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. దేశ ప్రగతికి 140 కోట్ల మంది భారతీయుల సమష్టి శక్తి అవసరమని చెప్పారు. అయితే స్వాతంత్ర్య వేడుకలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే వరుసగా రెండోసారి గైర్హాజరయ్యారు.

# వికసిత్ భారత్ దిశగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి..)



### హస్తకళలకు వుడ్ బ్యాంకుల బలం

హస్తకళల పరిరక్షణకు పవన్ కల్యాణ్ కీలక చర్యలు చేపట్టారు. రాజమహేంద్రవరం ధవళేశ్వరంలో సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకును ప్రారంభించిన ఆయన.. రాష్ట్రంలోని ఆరు ప్రధాన క్లస్టర్లలో ఏర్పాటు చేసిన వుడ్ బ్యాంకులను వర్చువల్‌గా ప్రారంభించారు. వీటి ద్వారా దాదాపు 5 వేల హస్తకళాకారుల కుటుంబాలకు కలప కొరత తీరనుంది. రాజమహేంద్రవరం వుడ్ బ్యాంకులో ప్రస్తుతం 30 క్యూబిక్ మీటర్ల కలప అందుబాటులో ఉంచారు. వచ్చే ఐదేళ్లకు సరిపడా కలపను సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, బొబ్బిలి వీణలు, ఇతర సంప్రదాయ కళాకృతుల తయారీకి ఈ బ్యాంకులు ఉపయోగపడనున్నాయి.

### కళాకారులతో పవన్ ముచ్చట

వుడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను పవన్ కల్యాణ్ తన సతీమణి అన్నా కొణిదెలతో కలిసి తిలకించారు. కళాకృతుల తయారీ విధానం, కళాకారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి కళాకృతిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కళాకారుడి వివరాలు, తయారీ విధానాన్ని పరిశీలించారు. కలప దుంగలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ల ద్వారా వాటి సేకరణ ప్రాంతం, చెట్టు వయస్సు, శాస్త్రీయ నామం వంటి వివరాలను తెలుసుకున్నారు. అగ్గిపెట్టెలో పట్టేంత చిన్న కళాకృతిని చూసి పవన్ దంపతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పలు కళాకృతులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించారు. సంప్రదాయ హస్తకళలకు ముడిసరుకు భరోసా కల్పించడంతో పాటు కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేయడమే వుడ్ బ్యాంకుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

# బీజేపీ ఎంపీ చూపు.. కాంగ్రెస్ వైపు?

(మొదటి పేజీ తరువాయి..)




### జెన్‌జీ.. మోదీ.. మారుతున్న లెక్కలు?

సదరు ఎంపీ తన రాజకీయ అంచనాలను కాంగ్రెస్ పెద్దల ముందు ఉంచినట్లు సమాచారం. బీజేపీపై జెన్‌జీ యువతలో వ్యతిరేకత పెరుగుతోందని, దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీపై కూడా అసంతృప్తి పెరుగుతోందని ఆయన అభిప్రాయపడినట్లు ప్రచారం జరుగుతోంది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు అవకాశాలు పెరిగే పరిస్థితి ఉందని కూడా వివరించినట్లు సమాచారం. అయితే ఇవి ఆ ఎంపీ వ్యక్తిగత అంచనాలా? లేక భవిష్యత్ రాజకీయ మార్పుకు సంకేతాలా? అన్నది ఇప్పుడు అసలు ప్రశ్న. ఇదే సమయంలో తెలంగాణ విషయంలో మరో కీలక సూచన చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ ప్రభావం మళ్లీ పెరగకుండా ఇప్పటి నుంచే వ్యూహం రూపొందించుకోవాలని, సాధ్యమైనంత మేర ఆ పార్టీని కట్టడి చేస్తే కాంగ్రెస్‌కు తెలంగాణలో రాజకీయంగా తిరిగి బలపడే అవకాశం ఉంటుందని చెప్పినట్లు సమాచారం. ఈ లెక్కలో బీజేపీ బలహీనపడటం కంటే బీఆర్ఎస్ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడమే ప్రధాన వ్యూహంగా చూడాలన్న అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలుస్తోంది.

### ఇది మార్పు సంకేతమా.. ముందస్తు రాజకీయమా?

ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. బీజేపీ ఎంపీ ఒకవైపు కాంగ్రెస్ జాతీయ నాయకత్వంతో సాన్నిహిత్యం పెంచుకుంటున్నారన్న ప్రచారం.. మరోవైపు బీఆర్ఎస్‌ను కట్టడి చేయాలని కాంగ్రెస్‌కు సూచించారన్న సమాచారం ఇప్పుడు రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే తెలంగాణలో పార్టీ మార్పులు, రాజకీయ పునర్వ్యవస్థీకరణలు కొత్తేమీ కావు. గతంలో ఒకే నేత వేర్వేరు పార్టీల్లో కీలక పాత్రలు పోషించిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. అందుకే ఈ పరిణామాన్ని ఇప్పుడే పార్టీ మార్పుగా ముద్ర వేయలేమని రాజకీయ వర్గాలే చెబుతున్నాయి. కానీ భవిష్యత్ అవసరాల కోసం తలుపు తెరిచి ఉంచే రాజకీయ సంభాషణగా మాత్రం చూడొచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరోవైపు కేసీ వేణుగోపాల్ ఇటీవల కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలపై తెలంగాణతో సహా పలు రాష్ట్రాల నేతలతో నిరంతరం సమన్వయం చేస్తున్నారు. ఆయన తెలంగాణ రాజకీయాలపై పార్టీ వ్యూహంలో కీలక పాత్ర పోషిస్తున్న విషయం బహిరంగమే. అయితే సదరు బీజేపీ ఎంపీతో జరిగినట్లు ప్రచారంలో ఉన్న భేటీకి ఇప్పటి వరకు ఎలాంటి ధృవీకరణ లేదు. అందుకే ఇప్పుడు అందరి చూపు ఒక్కటే ప్రశ్నపై ఉంది. ఇది కేవలం ఓ రహస్య సమావేశమా? లేక రాబోయే రాజకీయ మార్పుకు ముందస్తు సంకేతమా? దీనిపై బీజేపీ ఢిల్లీ పెద్దలు ఎలా స్పందిస్తారో.. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఏం చేస్తుందో.. వేచి చూడాల్సిందే.

# స్కూల్ ఠీక్ కరో

- బొద్దింకల కొత్త డిమాండ్
- సర్కారీ విద్యపై కాక్రోచ్ పార్టీ పోరాటం
- కనీస సదుపాయాలపై దేశవ్యాప్త ఉద్యమం

కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారాన్ని ప్రారంభించారు. మహారాష్ట్రలోని తన స్వగ్రామం సంతుక్ పింప్రిలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసిన తర్వాత జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేదని, కిటికీలు దెబ్బతిన్నాయని, విద్యార్థులకు సరిపడా బెంచీలు లేవని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తయినా ప్రభుత్వ పాఠశాలలో కనీసం నీరు కూడా లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని దీప్కే ప్రశ్నించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా సమాచారాన్ని సేకరించేందుకు చెక్‌లిస్ట్ రూపొందించామని తెలిపారు. మహారాష్ట్రతో పాటు దేశవ్యాప్తంగా పాఠశాలల పరిస్థితిపై డేటా సేకరించి వివరాలను సిద్ధం చేస్తామని చెప్పారు.

### ప్రభుత్వ స్కూళ్ల మూసివేతపై ఆరోపణలు

ప్రభుత్వ పాఠశాలలకు సదుపాయాలు కల్పించకుండా వాటిని మూసివేస్తున్నారని దీప్కే ఆరోపించారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 94 వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని ఆయన పేర్కొన్నారు. విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందితే ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. పేద విద్యార్థులకు కూడా సమాన విద్యా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు భారీగా ఉన్నాయని, ఒక్కో విద్యార్థి కుటుంబం ఏడాదికి రూ.1 లక్ష నుంచి రూ.1.5 లక్షల చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఫీజులకు పరిమితి విధించాలని ప్రభుత్వాన్ని కోరారు.

### ఆసుపత్రులపైనా తదుపరి పోరాటం

విద్య తర్వాత ప్రజారోగ్య సమస్యలపై కూడా ఉద్యమం చేపడతామని సీజేపీ ప్రకటించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి, శస్త్రచికిత్సల కోసం వేచి ఉండటం, సీటీ స్కాన్ కోసం వారం రోజుల వరకు నిరీక్షించాల్సి రావడం వంటి సమస్యలు ఉన్నాయని దీప్కే ఆరోపించారు.

# చేతిలో జెండా

## గుండెల్లో స్వర్ణాంధ్ర సంకల్పం

(మొదటి పేజీ తరువాయి..)

### 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

ఏపీని వికాసం నుంచి వైభవం వైపు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని సీఎం తెలిపారు. పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చామని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని, రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఇప్పటికే ఆమోదం లభించిందని వివరించారు. వీటి ద్వారా 11 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బీపీసీఎల్ వంటి భారీ ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

### ప్రజా సంక్షేమమే స్వర్ణాంధ్ర బాట

రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు వివరించారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20 వేలు అందిస్తున్నామని, వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్, మహిళా సాధికారత, పర్యాటక అభివృద్ధి, రాయలసీమ హార్టికల్చర్ హబ్ వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగానికి ఊతమిచ్చామని, రెవెన్యూ సంస్కరణలతో ఆస్తుల హక్కులను కాపాడుతున్నామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్‌పై ఈగల్ టాస్క్‌ఫోర్స్‌తో కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని తెలిపారు. దేశం గర్వించేలా ఏపీని స్వర్ణాంధ్రగా తీర్చిద్దేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# స్త్రీశక్తి పథకానికి ఏడాది పూర్తి

- మహిళలతో కలిసి బస్సులో బాబు ప్రయాణం
- పథకం అమలు తీరుతెన్నులపై సంభాషణ
- మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందన్న సీఎం



కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీశక్తి ఉచిత బస్సు పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించారు. రాజధానిలోని పరేడ్ గ్రౌండ్స్ నుంచి సీఎం క్యాంపు కార్యాలయం వరకు ప్రయాణిస్తూ వివిధ జిల్లాల మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. పథకం వల్ల కలుగుతున్న ప్రయోజనాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార మహిళకు నెలకు రూ.4 వేలు, నంద్యాల మహిళకు రూ.1,500, మరో యువతికి రూ.3 వేల వరకు ప్రయాణ ఖర్చు ఆదా అవుతోందని మహిళలు సీఎంకు వివరించారు. చేనేత మహిళలు ముడిసరుకు కొనుగోలు, చీరల మార్కెటింగ్ కోసం ఉచిత ప్రయాణం ఉపయోగపడుతోందని చెప్పారు. విద్యార్థినులకు కూడా ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారిందని తెలిపారు.

### 87 కోట్ల ఉచిత ప్రయాణాలు

స్త్రీశక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 87 కోట్ల ఉచిత ప్రయాణాలు జరిగాయని, రోజుకు 24 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలోని 9,978 బస్సుల్లో 7,631 బస్సుల్లో ఈ పథకం అమలవుతోందని చెప్పారు. అంటే 76 శాతం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుతోందన్నారు. పథకం అమలుకు ముందు బస్సు ప్రయాణాల్లో మహిళల వాటా 40 శాతం ఉంటే.. ప్రస్తుతం అది 62 శాతానికి పెరిగిందని వివరించారు. మహిళల ఆదాయం పెరగడం, ఆరోగ్యం మెరుగుపడటం, కుటుంబాల ఆర్థిక పరిస్థితి బలోపేతం కావడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాల్లో రూ.25 వేల కోట్ల పొదుపు సొమ్ము ఉందని తెలిపారు. మహిళలు రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారని ప్రశంసించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచుల నిర్మూలనలో మహిళలు భాగస్వాములు కావాలని, రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిని అడ్డుకునే చైతన్యం పెంచుకోవాలని పిలుపునిచ్చారు.



# పొట్ట పెరిగిందా

- ప్రమాదం మొదలైనట్టే?
- బయటికి ఆరోగ్యం.. లోపల ముప్పు
- మారుతున్న జీవనశైలికి మౌన హెచ్చరిక

ఉదయం లేవగానే టీ.. మధ్యాహ్నం హడావుడి భోజనం.. సాయంత్రం బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్.. రాత్రి ఆలస్యంగా డిన్నర్.. ఆ తర్వాత గంటల తరబడి మొబైల్ ముందు కూర్చోవడం. ఇది హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖ, తిరుపతి, వరంగల్, గుంటూరు వరకు పట్టణ జీవనంలో చాలామందికి అలవాటవుతున్న జీవనశైలి. బయటికి పెద్దగా అనారోగ్యంగా కనిపించకపోయినా శరీరం లోపల మాత్రం సమస్యలు నెమ్మదిగా పేరుకుపోవచ్చు. దీనినే వైద్య రంగంలో మెటబాలిక్ సిండ్రోమ్ అంటారు. ఇది ఒక్క వ్యాధి కాదు.. పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం, రక్తపోటు, రక్తంలో ట్రైగ్లిజరైడ్లు పెరగడం, మంచి కొలెస్ట్రాల్ తగ్గడం, రక్తంలో చక్కెర నియంత్రణ తప్పడం వంటి సమస్యలు ఒకేసారి కనిపించే ప్రమాద సంకేతం. ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చేస్తే టైప్ 2 మధుమేహం, గుండె జబ్బులు, స్ట్రోక్, ఫ్యాటీ లివర్, కిడ్నీ సమస్యలు వంటి తీవ్రమైన అనారోగ్యాలకు దారి తీసే అవకాశం ఉంది. అంటే.. వ్యాధి ఒక్కసారిగా తలుపు తట్టదు. మన రోజువారీ అలవాట్లలోనే నెమ్మదిగా దాని అడుగులు మొదలవుతాయి.

### బరువు కంటే పొట్టే పెద్ద హెచ్చరిక

మెటబాలిక్ సిండ్రోమ్‌లో అత్యంత కీలకమైన విషయం శరీరంలో కొవ్వు ఎక్కడ పేరుకుపోతుందన్నది. మొత్తం బరువు కంటే పొట్ట చుట్టూ కొవ్వు ఎక్కువగా ఉండటం ప్రమాదాన్ని పెంచుతుంది. సాధారణంగా పురుషుల్లో నడుము చుట్టుకొలత 100 సెంటీమీటర్లకు మించి, మహిళల్లో 90 సెంటీమీటర్లకు మించి ఉంటే అప్రమత్తం కావాలి. ట్రైగ్లిజరైడ్లు 150 mg/dLకు పైగా, HDL 40 mg/dL కంటే తక్కువగా, రక్తపోటు 130/80కు పైగా ఉండటం కూడా ప్రమాద సూచికలుగా పరిగణించాలి. "నాకు బరువు పెద్దగా పెరగలేదు కదా" అనే నిర్లక్ష్యం ఇక్కడే ప్రమాదకరం. ముఖ్యంగా కూర్చునే ఉద్యోగాలు, రోజంతా వాహన ప్రయాణం, శారీరక శ్రమ తగ్గిపోవడం, అధికంగా తెల్లబియ్యం, స్వీట్లు, బేకరీ పదార్థాలు, చక్కెర పానీయాలు, వేయించిన ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లు సమస్యను పెంచవచ్చు. అయితే ప్రతి వ్యక్తి పరిస్థితి ఒకేలా ఉండదు. ఈ కొలతల్లో మార్పులు కనిపిస్తే వైద్యుడి సలహాతో రక్తపరీక్షలు చేయించుకోవడం ముఖ్యం.

### మందుల కాదు.. జీవనశైలి మారాలి

మెటబాలిక్ సిండ్రోమ్‌ను ఎదుర్కోవడంలో మొదటి ఆయుధం జీవనశైలి మార్పే. ఆకలితో ఉండే క్రాష్ డైట్లు, ఒక్కసారిగా బరువు తగ్గించే పద్ధతులు దీర్ఘకాలిక పరిష్కారం కావు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పులు, గుడ్లు, చేపలు, తక్కువ కొవ్వు ఉన్న ప్రోటీన్ ఆహారం, ఆరోగ్యకరమైన కొవ్వులకు ప్రాధాన్యం ఇవ్వాలి. అధికంగా శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లను తగ్గించి పోషక విలువ ఉన్న సమతుల ఆహారం తీసుకోవాలి. రోజూ కదలడం అలవాటు చేసుకోవాలి. వారానికి సుమారు 150 నిమిషాల మితమైన శారీరక వ్యాయామం లక్ష్యంగా పెట్టుకోవచ్చు. మొదట సాధ్యం కాకపోతే కొద్దిసేపు నడకతో ప్రారంభించి క్రమంగా పెంచాలి. వారానికి కనీసం మూడు రోజుల బలవర్ధక వ్యాయామం కూడా ఉపయోగపడుతుంది. ఒత్తిడి తగ్గించడం, సరిపడా నిద్ర, భోజనం తర్వాత చిన్న నడక, రాత్రివేళ అతిగా తినకపోవడం కూడా కీలకం. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, పొట్ట చుట్టూ కొవ్వు ఉన్నవారు సమస్యను తేలికగా తీసుకోకూడదు. పొట్ట పెరగడం కేవలం అందం సమస్య కాదు.. అది శరీరం లోపల ఏదో తప్పు జరుగుతోందన్న అలారం కావచ్చు. ఈ రోజు కొద్దిగా నడక మొదలుపెట్టడం రేపటి పెద్ద ఆసుపత్రి బిల్లును తప్పించగలదు. అనుమానం ఉంటే స్వయంగా నిర్ణయం తీసుకోకుండా వైద్యుడిని సంప్రదించి రక్తపోటు, చక్కెర, కొలెస్ట్రాల్, నడుము కొలతలను పరీక్షించుకోవడం ఉత్తమం.

# పెట్టుబడి పెట్టండి..

- ఎప్‌స్టీన్‌ను కోరిన ఆంథ్రోపిక్ సీఈఓ భార్య
- కామి క్లార్క్ వ్యవహారం వైరల్ చర్చ
- విందు ఆ తర్వాత వెంటనే పెట్టుబడుల కహానీ



ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడీ భార్య కామి క్లార్క్‌కు సంబంధించిన పాత ఈమెయిల్స్ ఇప్పుడు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. 2011లో వివాదాస్పద ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆమె పరిచయం ఏర్పడింది. సాహిత్య ఏజెంట్ జాన్ బ్రాక్‌మన్ ద్వారా ఈ పరిచయం జరిగినట్లు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని ఈమెయిల్స్ చూపిస్తున్నాయి. పరిచయం తర్వాతే అసలు కథ మొదలైంది. క్లార్క్ తన వ్యాపారం గురించి ఎప్‌స్టీన్‌తో మాట్లాడారు. తన కంపెనీకి పెట్టుబడి అవసరముందని వివరించారు.

### స్క్రిప్టులు పంపి.. ఫండింగ్ అడిగారు

ఇక్కడే అసలు ట్విస్ట్. క్లార్క్ తన కంపెనీ రూపొందించాలనుకున్న తొలి నాలుగు సినిమాల స్క్రిప్టులు ఎప్‌స్టీన్‌కు పంపారు. అవి మహిళలను లక్ష్యంగా చేసుకున్న ప్రత్యేక వినోద వ్యాపారానికి సంబంధించినవిగా ఆమె వివరించినట్లు నివేదిక పేర్కొంది. కొంతకాలం తర్వాత ఆమె మరోసారి ఎప్‌స్టీన్‌ను సంప్రదించి తనతో పాటు భాగస్వామి నిర్వహిస్తున్న వ్యాపారంలో పెట్టుబడి పెట్టగలరా అని అడిగారు. అయితే ఎప్‌స్టీన్ పెట్టుబడి పెట్టినట్లు ఎలాంటి ఆధారం లేదు. పైగా టెలివిజన్ సెక్స్ కంటెంట్‌కు తాను నిధులు ఇవ్వలేనని అతడు సమాధానం ఇచ్చినట్లు ఈమెయిల్స్‌లో ఉంది.

### ఆంథ్రోపిక్‌లో పదవి లేకున్నా ప్రభావం

కామి క్లార్క్‌కు ఆంథ్రోపిక్‌లో అధికారిక పదవి లేదు. అయినా ఆమెను డారియో అమోడీకి సన్నిహిత వ్యూహాత్మక సలహాదారుగా నివేదిక అభివర్ణించింది. డావోస్ వంటి పెద్ద వేదికల్లో అమోడీతో కలిసి ఆమె కనిపించడం, కీలక పెట్టుబడిదారులతో మాట్లాడటం చర్చకు దారితీస్తోంది. గతంలో ఆమె అమోడీకి ఎరిక్ ష్మిత్‌తో పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషించారు. తర్వాత ష్మిత్ ఆంథ్రోపిక్‌కు ప్రారంభ పెట్టుబడిదారుల్లో ఒకరిగా మారారు. అందుకే ఇప్పుడు పాత ఎప్‌స్టీన్ ఈమెయిల్స్ బయటపడటంతో.. ఆంథ్రోపిక్ సీఈఓ కుటుంబం చుట్టూ మరోసారి ఆసక్తికర చర్చ మొదలైంది.

# జెండా పండుగ

(మొదటి పేజీ తరువాయి..)

### యువతకు 20 లక్షల ఉద్యోగాలు

రాష్ట్ర అభివృద్ధికి విద్య, ఉపాధిని అనుసంధానం చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. పాఠ్యపుస్తకాలపై నేతల ఫొటోలు కాకుండా ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఫొటోలు ముద్రిస్తున్నామని చెప్పారు. అమరావతికి చట్టబద్ధత, పోలవరం నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, రైల్వే జోన్ వంటి అంశాల్లో పురోగతి సాధించామని వివరించారు. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, పోలీసు శాఖలో ఖాళీలు భర్తీ చేస్తున్నామని తెలిపారు. గూగుల్ వంటి భారీ సంస్థలను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని చెప్పారు. యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా అమరావతి, విశాఖపట్నం, కర్నూలులో అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు.

# జగన్ బెయిల్ రద్దు చేయాలి

- ఎమ్మెల్యే జ్యోతి నెహ్రూ ఫైర్

(మొదటి పేజీ తరువాయి..)

### పరామర్శల పేరుతో రెచ్చగొడుతున్నారా?

జగన్ పరామర్శల పేరుతో ప్రజలను సమీకరించి ఆందోళనలకు కారణమవుతున్నారని జ్యోతుల నెహ్రూ ఆరోపించారు. పరామర్శలను రాజకీయ కార్యక్రమాలుగా మార్చి జనాలను రెచ్చగొట్టడం, గొడవలకు దారితీసే పరిస్థితులు సృష్టించడం సరికాదని అన్నారు. జగన్ శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించడం పేరుతో భారీగా జనాలను పోగేసి ఉద్రిక్తతలు పెంచుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే న్యాయపరమైన చర్యలు తప్పవని అన్నారు. జగన్ బెయిల్ అంశంపై సుప్రీంకోర్టు స్వయంగా దృష్టి సారించి తగిన నిర్ణయం తీసుకోవాలని జ్యోతుల నెహ్రూ కోరారు. ఈ వ్యాఖ్యలపై వైసీపీ ఎలా స్పందిస్తుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.

# బ్రిటీష్ వారిని తలపిస్తున్నారు?

- కూటమి పాలనపై బొత్స మండిపాటు

(మొదటి పేజీ తరువాయి..)

### పేదరికం పోయినప్పుడే అభివృద్ధి

దేశాన్ని మనమే నిర్మించుకోవాలన్న బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బొత్స అన్నారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు నిర్మించడం కాదని.. పేదలకు విద్య, వైద్యం అందించడం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి అని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందినట్లు భావించాలని అన్నారు. పేదరికం లేని ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా పాలన సాగాలని ఆకాంక్షించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఇదే లక్ష్యంతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదని విమర్శించారు. "ఇలాంటి స్వాతంత్ర్యం కోసమేనా మన పూర్వికులు పోరాడింది?" అంటూ ప్రభుత్వ తీరుపై బొత్స ప్రశ్నించారు. మతం, ప్రాంతం, రాజకీయ అనుబంధంతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సంక్షేమం అందించాల్సిందేనని స్పష్టం చేశారు.

# అక్రమ కేసులకు భయపడేది లేదు

- కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టీకరణ

(మొదటి పేజీ తరువాయి..)

### తప్పుడు కేసులపై న్యాయపోరాటం

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కాటసాని అన్నారు. అదే సమయంలో వైఎస్ జగన్‌పై ప్రజల విశ్వాసం మరింత బలపడుతోందని పేర్కొన్నారు. జగన్‌ను చూసేందుకు ప్రజలు తమంతట తామే వస్తున్నారని, దీనిని జన సమీకరణగా చిత్రీకరించి కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం ఎన్ని ఒత్తిళ్లు తీసుకొచ్చినా ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమపై నమోదైన కేసులను చట్టపరంగా ఎదుర్కొంటామని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని తెలిపారు. అక్రమ కేసులతో పార్టీ శ్రేణులను అణచివేయడం సాధ్యం కాదని, ప్రజల సమస్యలపై పోరాటం మరింత బలంగా కొనసాగుతుందని కాటసాని రాంభూపాల్‌రెడ్డి హెచ్చరించారు.

# కరెప్షన్ ఫ్రీ తమిళనాడు

- అవినీతిని సహించేది లేదన్న సీఎం

(మొదటి పేజీ తరువాయి..)

. అవినీతిపై ప్రజల్లో జీరో టాలరెన్స్ రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చిన ప్రజలు ఓటు వేసి బాధ్యత ముగిసిందని భావించకూడదని విజయ్ అన్నారు. ప్రజలే పాలకులని, ప్రభుత్వం ప్రజలకు సేవకురాలిగా పనిచేయాలని స్పష్టం చేశారు. కులం, మతం, డబ్బు, కండబలం ప్రభావాన్ని పక్కనపెట్టి తనకు మద్దతు ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రభుత్వ సేవల్లో గౌరవమే తొలి నియమం

ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు ప్రజలకు సేవా కేంద్రాలుగా పనిచేయాలని సీఎం విజయ్ ఆదేశించారు. ప్రభుత్వ అధికారులను కలిసేందుకు వచ్చే ప్రజలను గౌరవంగా, మర్యాదగా చూడాలని, సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిప్పకూడదని స్పష్టం చేశారు. జూన్ 29, 30 తేదీల్లో జరిగిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సమావేశంలో ఈ మేరకు కఠిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో ప్రజా సంక్షేమం కోసం పరిపాలనా సహకారం కొనసాగుతుందని చెప్పారు. అయితే తమిళనాడు హక్కులకు వ్యతిరేకంగా ఉండే కేంద్ర విధానాలను మాత్రం టీవీకే ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన ప్రజా సంక్షేమ పథకాల్లో ఉపయోగకరమైన వాటిని కొనసాగిస్తామని తెలిపారు. జయలలిత తీసుకొచ్చిన అమ్మ క్యాంటీన్లను మరింత సమర్థంగా నిర్వహిస్తామని, ఉదయం అల్పాహార పథకాన్ని 6 నుంచి 8వ తరగతి వరకు విస్తరిస్తామని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీఎం విజయ్ పలు కీలక ఆర్థిక ప్రకటనలు చేశారు. మాజీ సైనికుల ఇద్దరు కుమార్తెల వివాహానికి ఇచ్చే సాయాన్ని ఒక్కొక్కరికి రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెంచారు. దివ్యాంగ మాజీ సైనికులు, వారి కుటుంబాలకు నెలవారీ సాయాన్ని రూ.5 వేల నుంచి రూ.7 వేలకు పెంచారు. స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్‌ను రూ.23 వేలకు, కుటుంబ పింఛన్‌ను నెలకు రూ.12,500కు పెంచినట్లు తెలిపారు.



# కోరుకున్న ప్రియుడు

**ప్రేమలో పడితే ప్రపంచం మారిపోదురా... మనమే మారిపోతాం! నిన్నటి వరకు మామూలుగా కనిపించిన ఆకాశం... మనిషి కోసం నీలంగా మారిపోతుంది. గాలి కూడా తన పేరే పలుకుతున్నట్టుంటుంది. ఆమె ఒక్కసారి నవ్వితే చాలు... రోజంతా పండగ. అతను ఒక్కసారి "నేనున్నానురా" అంటే చాలు... ఎన్ని కష్టాలైనా చిన్నవే. ఫోన్‌లో గంటల కొద్దీ మాట్లాడినా ఇంకా చెప్పకోవాల్సింది మిగిలిపోతుంది. ఒక్క మెసేజ్ కోసం కళ్లంతా ఫోన్ మీదే ఉంటాయి. ఒక్క చూపు కోసం గుండె పరుగెడుతుంది. అదే ప్రేమరా! కానీ విను... ప్రేమ అంటే ఇంత ఈజీ కాదు. ఇదే అసలు సవాలు! ప్రేమించినప్పుడు చేతులు పట్టుకోవడం అందరూ చేస్తారు. కష్టాల్లో కూడా ఆ చేయి వదలకుండా ఉండేవాడే నిజమైన ప్రేమికుడు. నవ్వులో తోడుండటం సులువు... కన్నీటిలో పక్కన కూర్చోవడమే అసలు ప్రేమ. మాటలు మధురంగా చెప్పడం సులువు... ఎదుటివారి మౌనాన్ని అర్థం చేసుకోవడమే అసలు బంధం. కోపంలో గెలవడం సులువు... బంధం కోసం ఓడిపోవడమే గొప్పదనం. ఎందుకంటే ప్రేమలో "నువ్వు నాది" అనడం కంటే... "నువ్వు ఎలా ఉన్నా నీ పక్కనే నేనున్నా" అని చెప్పగలగడం గొప్పది. కాలం మారినా, పరిస్థితులు తిరిగినా, మనసు అలసినా... ఒకరినొకరు మళ్లీ మళ్లీ ఎంచుకోవడమే ప్రేమ. పూలు, బహుమతులు, మాటలు ఇవన్నీ అందమైన అలంకారాలే. కానీ నిజమైన ప్రేమకు అసలైన చిరునామా ఒక్కటే... కష్టం వచ్చినప్పుడు కూడా వదలని చేయి! అదే ప్రేమంటే ఇదిరా... అందులోనే అసలైన సవాలిదిరా!**

**• ప్రేమ ఎంత మధురం... నిజం అంత కఠినం!**

ప్రేమలో పడిన క్షణం... మనసులో ఒక అద్భుతమైన వెలుగు పుడుతుంది. నిన్నటి వరకు మామూలుగా కనిపించిన ఆకాశం ఒక్కసారిగా మరింత నీలంగా అనిపిస్తుంది. గాలిలో కూడా గంధపు పరిమళం తేలుతున్నట్టుంటుంది. దారిపక్కన కనిపించే ప్రతి పువ్వూ మన కోసమే వికసించినట్టుగా కనిపిస్తుంది. ఎదుటి మనిషి నవ్వు ఒక మధురమైన పాటలా వినిపిస్తుంది. అతని మాటల్లో ఒక ప్రపంచం కనిపిస్తుంది. ఆమె చూపుల్లో ఒక యుగం కనిపిస్తుంది. ప్రేమలో మునిగిన మనసుకు ప్రపంచం అందంగా కనిపించదు... ప్రపంచమే ప్రేమగా కనిపిస్తుంది. "నువ్వుంటే చాలు... ఇంకేం కావాలి?" అనే అమాయకమైన నమ్మకం గుండెను నింపేస్తుంది. ఆ వయసులో ప్రేమకు లెక్కలు ఉండవు. కాలానికి కొలతలు ఉండవు. ఎంతగా ప్రేమిస్తున్నామో కొలిచే త్రాసు ఉండదు. ఒకరి కోసం మరొకరు తమను తాము మరిచిపోవడమే ప్రేమ అనిపిస్తుంది. ఎదుటి వ్యక్తిలోని లోపాలు కూడా అందమైన అలవాట్లుగానే కనిపిస్తాయి. అతని కోపంలో ప్రేమను వెతుకుతాం. ఆమె మౌనంలో మమకారాన్ని చదువుతాం. చిన్న గొడవలో కూడా విడిపోవాలనే భయం కంటే... మరింత దగ్గరవ్వాలనే తపనే ఎక్కువగా ఉంటుంది. ఆ దశలో ప్రేమ ఒక అందమైన కల. కానీ జీవితం... ఆ కలను మేల్కొలిపే ఉదయం.

**• కాలంతో ప్రేమ మారుతుందా?**

కాలం కదులుతుంది. పూలు వాడిపోతాయి. బహుమతుల కంటే బిల్లులు ముఖ్యమవుతాయి. గంటల తరబడి సాగిన సంభాషణలు... జీవితపు పరుగులో దొరికే కొన్ని నిమిషాలుగా మారిపోతాయి. రోజంతా ఒకరినొకరు తలుచుకునే రోజుల స్థానంలో... బాధ్యతలతో నిండిన రోజులు వస్తాయి. అప్పుడే ప్రేమకు అసలు పరీక్ష మొదలవుతుంది. ఒకరిపై ఒకరికి ఉన్న మక్కువ మాత్రమే కాదు... ఒకరి బాధను మరొకరు మోయగలరా? ఒకరి కన్నీటిని మరొకరు తుడవగలరా? ఒకరి తప్పును మరొకరు క్షమించగలరా? ఒకరి కల కోసం మరొకరు తమ సౌకర్యంలో కొంత వదులుకోగలరా? అనే ప్రశ్నలు ఎదురుగా నిలుస్తాయి. అక్కడే ప్రేమకు, ఆకర్షణకు మధ్య ఉన్న అసలు తేడా బయటపడుతుంది. ఆకర్షణకు అందం కావాలి. ప్రేమకు ఆత్మీయత కావాలి. ఆకర్షణకు కొత్తదనం కావాలి. ప్రేమకు నిబద్ధత కావాలి. ఆకర్షణకు మధురమైన మాటలు చాలు. ప్రేమకు మౌనాన్ని కూడా అర్థం చేసుకునే హృదయం కావాలి. ఆకర్షణలో "నాకు నువ్వు కావాలి" అనే కోరిక ఉంటుంది. ప్రేమలో "నీకు నేను అవసరమైనప్పుడు నీ పక్కనే ఉంటాను" అనే బాధ్యత ఉంటుంది. అందుకే ప్రేమ కేవలం ఒక భావన కాదు... అది ఒక నిర్ణయం. ప్రతిరోజూ అదే మనిషిని మళ్లీ మళ్లీ ఎంచుకోవాలనే నిర్ణయం. పరిస్థితులు మారినా, కాలం మారినా, మనసు అలసినా... బంధాన్ని నిలబెట్టుకోవాలనే సంకల్పం.

**• గౌరవం లేని ప్రేమ గాయమవుతుంది!**

ప్రేమ ఒక్కటే బంధాన్ని నిలబెట్టదు. ప్రేమ పునాది కావచ్చు... కానీ ఆ పునాదిపై నిలిచే ఇంటికి నమ్మకం గోడలు, గౌరవం తలుపులు, సహనం మారిపోతుంది. ఎంత ప్రేమ ఉన్నా గౌరవం లేకపోతే ఆ ప్రేమ నెమ్మదిగా గాయంగా మారుతుంది. ఎంత అనురాగం ఉన్నా నమ్మకం లేకపోతే ప్రతి మాట అనుమానంగా మారుతుంది. ఎంత దగ్గరగా ఉన్నా మనసులోని మాట చెప్పుకోలేకపోతే... ఇద్దరి మధ్య కనిపించని గోడ నెమ్మదిగా ఎత్తుగా మారుతుంది. అందుకే నిజమైన ప్రేమ అంటే చేతులు పట్టుకుని పక్కపక్కనే నడవడం మాత్రమే కాదు... ఒకరి మనసును మరొకరు అత్యంత జాగ్రత్తగా చేతుల్లో పెట్టుకుని కాపాడుకోవడం. ప్రేమలో త్యాగం అనే మాట ఎంతో పవిత్రమైనది. కానీ త్యాగం అంటే తనను తాను పూర్తిగా కోల్పోవడం కాదు. తన ఆనందంలో కొంత భాగాన్ని పంచుకోవడం. "నాకు నచ్చింది" అనే మాట పక్కనే "మనిద్దరికీ నచ్చేదేమిటి?" అని ఆలోచించడం. తన దారిలో మరొకరి అడుగులకు చోటివ్వడం. కొన్నిసార్లు తన కోపాన్ని దిగమింగడం. గెలిచే అవకాశం ఉన్నా... బంధం కోసం ఓడిపోవడాన్ని అంగీకరించడం. ఎందుకంటే కొన్ని వాదనల్లో గెలిచిన మనిషి... చివరికి తన మనిషినే కోల్పోతే ఆ గెలుపు దేనికి? ప్రేమకు ఓర్పు ఎంత అవసరమో... వానకు నేల అంత అవసరం. మనిషి తప్పుల్లేని వాడు కాదు. మనసు కూడా ప్రతిరోజూ ఒకేలా ఉండదు. నిన్న నవ్విన మనిషి ఈరోజు మౌనంగా ఉండొచ్చు. నిన్నటి ఉత్సాహం ఈరోజు అలసటగా మారొచ్చు. ఆ మార్పును ద్రోహంగా చూడకుండా... మానవత్వంగా అర్థం చేసుకోగలిగితేనే బంధం బలపడుతుంది.

**• మాటే వంతెన.. మౌనమే శత్రువు**

ప్రేమలో సంభాషణ ఒక చిన్న వంతెన. ఆ వంతెన కూలిపోతే... రెండు ఒడ్డుల మధ్య దూరం పెరుగుతుంది. బాధ కలిగితే చెప్పాలి. అపార్థం వస్తే అడగాలి. కోపం వస్తే కొంత సమయం తీసుకోవాలి. కానీ మౌనాన్ని శిక్షగా ఉపయోగించకూడదు. మనసులో పేరుకుపోయే చిన్న చిన్న బాధలు... ఒకరోజు పెద్ద కొండలుగా మారిపోతాయి. మాట్లాడని కన్నీరు... ఒకరోజు విడిపోవాలనే నిర్ణయంగా మారుతుంది. అందుకే ప్రేమలో మాటలకంటే నిజాయితీ ముఖ్యం. వాదన కంటే వినడం ముఖ్యం. సమాధానం చెప్పడం కంటే ముందుగా అర్థం చేసుకోవడం ముఖ్యం. "నువ్వు నన్ను అర్థం చేసుకోవాలి" అని ఎదురు చూడటం కంటే... "నేను నిన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను" అని మొదలుపెట్టడం ప్రేమకు నిజమైన ఆరంభం. మరో కఠినమైన నిజం ఏమిటంటే... మనం ప్రేమించే మనిషిని మన ఇష్టానికి మార్చలేం. "నా కోసం ఒకరోజు మారిపోతాడు" అనే ఆశతో ఎన్నో హృదయాలు సంవత్సరాలను కోల్పోతాయి. సలహా ఇవ్వవచ్చు. ప్రేమించవచ్చు. ప్రోత్సహించవచ్చు. కానీ మార్పు తలుపు లోపల నుంచి మాత్రమే తెరుచుకుంటుంది. ఎదుటివారికి మారాలనే కోరిక లేకపోతే... మన కన్నీళ్లు కూడా ఆ తలుపుకు తాళం చెవిగా మారవు. అందుకే ప్రేమించేముందు ఎదుటివారిని మన ఊహల్లో కాదు... నిజ జీవితంలో చూడాలి. వారి మంచిని మాత్రమే కాదు... వారి బలహీనతలను కూడా అర్థం చేసుకోవాలి. మనకు నచ్చని స్వభావాలను "తర్వాత మారిపోతుంది" అంటూ దాచిపెట్టకూడదు. ఎందుకంటే ప్రేమ కళ్లకు అందాన్ని పెంచుతుంది... కానీ నిజాన్ని

**• కలిసి ఉండటమే ప్రేమ కాదా?**

ప్రేమలో మరో అందమైన రహస్యం ఉంది. కలిసి ఉండటం కంటే... కలిసి ఎదగడం గొప్పది. ఒకరి కలలను మరొకరు చిన్నచూపు చూడని బంధమే నిజమైన బంధం. ప్రేమించిన తర్వాత స్నేహితులను కోల్పోవడం, తన అభిరుచులను వదిలేయడం, తన లక్ష్యాలను పక్కన పెట్టడం... ఇవి ప్రేమకు చిహ్నాలు కావు. రెండు దీపాలు ఒకదానికొకటి వెలుగునివ్వాలి. కానీ ఒకటి వెలగడానికి మరొకటి ఆరిపోవాల్సిన అవసరం లేదు. నిజమైన ప్రేమ అంటే "నువ్వు లేక నేను లేను" అని చెప్పడం మాత్రమే కాదు... "నువ్వు నీలా ఉండేందుకు నేను నీ పక్కన ఉంటాను" అని చెప్పడం. ఒకరి రెక్కలను మరొకరు కత్తిరించకుండా... రెండు ఆకాశాలను ఒకే దిశలో కలపడం. ప్రేమలో క్షమించడం కూడా ఒక పవిత్రమైన గుణం. మనిషిని ప్రేమించడం అంటే అతని గతాన్ని కూడా అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం. కానీ క్షమించడం అంటే మళ్లీ మళ్లీ గాయపడటానికి అనుమతి ఇవ్వడం కాదు. నిజమైన క్షమలో మార్పుకు అవకాశం ఉంటుంది. గౌరవం లేకుండా క్షమించడం... గాయాన్ని మరింత పొడిగించడమే. అందుకే ప్రేమకు కరుణ ఉండాలి... కానీ వివేకం కూడా ఉండాలి. కొన్ని ప్రేమలు పెళ్లి వరకు వెళ్తాయి. కొన్ని ప్రేమలు జీవితాంతం జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. కొన్ని బంధాలు చివరి శ్వాస వరకు చేతులు పట్టుకుని నడుస్తాయి. మరికొన్ని మధ్యలోనే విడిపోతాయి. కానీ ప్రతి ప్రేమ మనకు ఏదో ఒక పాఠాన్ని నేర్పుతుంది. ఎవరో మన జీవితంలోకి వచ్చి... మనల్ని మనకే పరిచయం చేస్తారు. ఎవరో మన గుండెను పగలగొట్టి... మనసు ఎంత సున్నితమైనదో నేర్పుతారు. మరొకరు మనకు తోడుగా నిలిచి... ప్రేమ అంటే కేవలం పొందడం కాదని, పంచుకోవడమని తెలియజేస్తారు.

**కాల పరీక్షలో ప్రేమ నిలిచేదెలా?**

ప్రేమ ఒక పువ్వు కాదు... ప్రతిరోజూ నీళ్లు పోయాల్సిన మొక్క. ఒకరోజు పూసిందని దాన్ని వదిలేయడం కాదు. ఎండలో కాపాడాలి. వానలో నిలబెట్టాలి. ముళ్లను జాగ్రత్తగా తొలగించాలి. అప్పుడే అది సంవత్సరాల తర్వాత కూడా పరిమళిస్తుంది. ప్రేమ ఎంత మధురమో... దాన్ని అనుభవించిన గుండెకు తెలుసు. నిజం ఎంత కఠినమో... దాన్ని కోల్పోయిన గుండెకు తెలుసు. కానీ ప్రేమకు నిజం తోడైతే... ఆ మాధుర్యం మరింత పవిత్రమవుతుంది. త్యాగం తోడైతే మరింత లోతవుతుంది. ఓర్పు తోడైతే మరింత దీర్ఘమవుతుంది. గౌరవం తోడైతే మరింత అందమవుతుంది. నమ్మకం తోడైతే... అది కేవలం బంధంగా మిగలదు... జీవితానికే ఒక అర్థంగా మారుతుంది. ఎందుకంటే చివరికి మనిషి తన జీవితంలో ఎన్ని పూలు అందుకున్నాడో గుర్తుపెట్టుకోడు. తన కళ్లలో కన్నీరు వచ్చినప్పుడు ఎవరు పక్కన కూర్చున్నారో మాత్రం గుర్తుపెట్టుకుంటాడు. ఎన్ని ఖరీదైన బహుమతులు అందుకున్నాడో మరిచిపోవచ్చు. తన విరిగిన మనసును ఎవరు రెండు చేతుల్లోకి తీసుకుని జాగ్రత్తగా మోశారో మాత్రం గుండె ఎప్పటికీ మరచిపోదు. అందుకే ప్రేమను కోరుకునే ముందు... ప్రేమను మోయగల హృదయాన్ని పెంచుకోవాలి. ప్రేమించడమంటే ఒక మనిషిని పొందడం కాదు. అతని ఆనందంలో మన ఆనందాన్ని కనుగొనడం. అతని కన్నీటిలో మన కళ్లను తడపడం. అతని కలలకు మన భుజాలను మెట్టుగా ఇవ్వడం. అతని బలహీనతలపై నవ్వకుండా... వాటి పక్కన నిలబడటం. గెలుపు వచ్చినప్పుడు కలిసి నవ్వడం... ఓటమి వచ్చినప్పుడు కలిసి నిలబడటం. అదే ప్రేమకు అసలు చిరునామా. ప్రేమ మాటల్లో మొదలవుతుంది... నమ్మకంలో పెరుగుతుంది... త్యాగంలో పరిమళిస్తుంది... ఓర్పులో పరిపక్వమవుతుంది... గౌరవంలో నిలబడుతుంది... కాలం పరీక్షించినప్పుడు మాత్రమే నిజమవుతుంది.

**• చేతులు కలిస్తే కాదు.. హృదయాలు కలవాలి!**

ప్రేమ ఒక క్షణపు మత్తు అయితే... అది కాలంతో కరిగిపోతుంది. ప్రేమ ఒక జీవితపు వ్రతం అయితే... కాలమే దాని ముందు తలవంచుతుంది. అందుకే ప్రేమను కేవలం గుండెలో పెట్టుకోకండి... జీవితంలో ఆచరించండి. పువ్వులా ప్రేమించండి... కానీ వేరులా బలంగా నిలబడండి. వానలా కురవండి... కానీ నేలలా ఓర్చుకోండి. చంద్రుడిలా వెలిగించండి... కానీ సూర్యుడిలా వేడిని కూడా భరించండి. ఎందుకంటే... ప్రేమలో కలిసిన రెండు హృదయాలు అదృష్టం. ప్రేమలో ఒకరినొకరు అర్థం చేసుకున్న రెండు మనసులు వరం. ప్రేమలో కష్టాలను కలిసి దాటిన రెండు ప్రాణాలు చరిత్ర. ప్రేమించి... క్షమించి... త్యాగం చేసి... చివరి వరకు ఒకరి పక్కన మరొకరు నిలిచిన ఇద్దరు మనుషులు — అదే నిజమైన ప్రేమకు చిరునామా. ప్రేమ ఎంత మధురం... నిజం అంత కఠినం. కానీ ఆ కఠినమైన నిజాన్ని కూడా చేతులు పట్టుకుని దాటగలిగితే... ఆ ప్రేమ కేవలం ఒక కథ కాదు... రెండు గుండెలు కలిసి రాసుకున్న నిలువెత్తు ప్రేమకావ్యం. అవును... ఇదే నిజం. ఇదే సత్యం. ఇదే నిజమైన ప్రేమకు పరమార్థం.

రెండు గుండెల మర్ధనంలో పుట్టిన ప్రేమామృతం... రెండు మనసుల మౌనంలో పెరిగిన అనురాగం... రెండు జీవితాల ప్రయాణంలో నిలిచిన నమ్మకం... అదే ప్రేమ. అదే జీవితం. అదే నిజమైన ప్రేమకు శాశ్వత చిరునామా.

**• అవమానం భరించడమే ప్రేమా?**

అయితే ఓర్పు పేరుతో అవమానాన్ని భరించడం ప్రేమ కాదు. త్యాగం పేరుతో ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడం ప్రేమ కాదు. ఒకరిని ప్రేమించడం అంటే వారి ప్రతి తప్పును సమర్థించడం కాదు. తప్పు చేసినప్పుడు కూడా ప్రేమతోనే "ఇది తప్పు" అని చెప్పగలగడం... ప్రేమలోని నిజాయితీ. ఎందుకంటే నిజమైన ప్రేమ మనిషిని బలహీనుడిగా మార్చదు... మరింత మంచి మనిషిగా తీర్చిదిద్దుతుంది. ఎదుటివారి తప్పులను కప్పిపుచ్చడం కంటే... వారు తమను తాము సరిదిద్దుకునేలా అండగా నిలవడం గొప్ప ప్రేమ. ప్రేమలో కనిపించే కొన్ని చిన్న సంకేతాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. కోపం వచ్చినప్పుడు ఎదుటివారిని అవమానించడం, ప్రతి అడుగునూ నియంత్రించాలనుకోవడం, అబద్ధాలను అలవాటుగా మార్చుకోవడం, స్నేహితులను దూరం చేయడం, వ్యక్తిగత స్వేచ్ఛను ప్రశ్నించడం... ఇవేవీ ప్రేమకు గుర్తులు కావు. ప్రేమ పేరుతో మనిషికి ఊపిరాడకుండా చేయడం ప్రేమ కాదు. పంజరం బంగారంతో చేసినా... అది పంజరమే. ప్రేమ అంటే పక్కనే ఉండి కూడా ఎదుటివారికి ఆకాశమంత స్వేచ్ఛను ఇవ్వగలగడం. అందుకే ప్రేమలో ఒకరినొకరు సొంతం చేసుకోవాలనే తపన కంటే... ఒకరినొకరు అర్థం చేసుకోవాలనే తపన గొప్పది. ఖరీదైన బహుమతులు ప్రేమను అలంకరించవచ్చు... కానీ ప్రేమను నిలబెట్టలేవు. పుట్టినరోజున ఇచ్చిన ఖరీదైన గడియారం కాలాన్ని చూపించవచ్చు. కానీ ఆ గడియారం పక్కన కూర్చుని "నువ్వు ఎలా ఉన్నావు?" అని అడిగే రెండు నిమిషాల ఆప్యాయత... జీవితాంతం గుర్తుండిపోతుంది. పెద్ద పెద్ద విహారయాత్రల కంటే... ఒక కష్టమైన రోజున భుజం వాల్చుకోవడానికి ఇచ్చిన చోటు ఎంతో విలువైనది. వేల మాటల కంటే "నేను ఉన్నాను" అనే నాలుగు అక్షరాలు కొన్నిసార్లు గుండెకు మందులవుతాయి.

**• చివరి వరకు నిలబడటమే ప్రేమ**

ప్రేమలో పడటం చాలా సులువు... కానీ ప్రేమలో నిలబడటం మాత్రం అంత సులువు కాదు. గుండెను ఎవరికైనా ఇవ్వొచ్చు... కానీ ఆ గుండెను గాయపడినా తిరిగి అదే మనిషిని నమ్మడం చాలా కష్టం. ప్రేమలో కల్లోలం వస్తుంది. అనుమానాలు వస్తాయి. కోపాలు వస్తాయి. మౌనాలు వస్తాయి. మాటల మధ్య దూరాలు పెరుగుతాయి. ఒక్కోసారి "ఇంక చాలు" అనిపిస్తుంది. కానీ అక్కడే అసలు ప్రేమకు పరీక్ష మొదలవుతుంది. విడిపోవడానికి వంద కారణాలు కనిపించినా... కలిసి ఉండటానికి ఒక్క కారణాన్ని వెతుక్కోగలిగితే అదే నిజమైన ప్రేమ! ప్రేమలో సవాళ్లు రావడం ఓటమి కాదు... వాటిని కలిసి ఎదుర్కోలేకపోవడమే అసలైన ఓటమి. ఎదుటివారి కోపాన్ని భరించడం మాత్రమే కాదు... ఆ కోపం వెనుక దాగిన బాధను అర్థం చేసుకోవాలి. మౌనాన్ని శిక్షగా కాకుండా... ఒక పిలుపుగా వినాలి. తప్పులు జరిగినప్పుడు అహంకారాన్ని పక్కన పెట్టాలి. "నేనే కరెక్ట్" అనే గెలుపు కంటే... "మన బంధం నిలవాలి" అనే గెలుపును ఎంచుకోవాలి. ఎందుకంటే ప్రేమ అంటే పూలదారి కాదు... ముళ్ల మధ్య నడిచే ప్రయాణం. చేతిలో చేయి ఉన్నప్పుడు కాదు... దారి కనిపించనప్పుడు కూడా చేయి వదలకపోవడమే ప్రేమ. ప్రపంచం మొత్తం ఎదురు నిలిచినా "నువ్వున్నావుగా" అని ధైర్యం చెప్పగలిగితే అదే బంధం. ప్రేమలో కల్లోలం తప్పదు... కష్టం తప్పదు... కన్నీళ్లు తప్పవు. కానీ ఆ కల్లోలాన్ని దాటి, ఆ కన్నీళ్లను తుడుచుకుంటూ, చివరి వరకు "మనిద్దరం" అని నిలబడగలిగితే... అదే ప్రేమంటే ఇదిరా! అదే సవాలంటే ఇదిరా! అదే రెండు గుండెలు కలిసి రాసుకునే అసలైన ప్రేమకథ!





# అజాత శత్రువు అటల్‌జీ

## నేడు వాజ్ పేయి వర్ధంతి

రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న గొప్ప నాయకుడు వాజ్ పెయి. ప్రజా సేవ కోసం బ్రహ్మచారిగా ఉండిపోయి... తన జీవితం మొత్తం దేశం కోసం అంకితం చేశారు. రెండు సీట్ల పార్టీని దేశ రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీగా మలచిన అపర చాణుక్యుడు. పార్లమెంట్ సాక్షిగా నెహ్రూలాంటి నేతల్ని సైతం గడగడలాడించారు. హీటెక్కించే ప్రసంగాలు చేయడంలోనే కాదు.. హాస్యం పండిచండంలోనూ ఆయనకు ఆయనే సాటి. ప్రసంగాల్లో... చట్ట సభల్లో మధ్యమధ్యలో కవిత్వాన్ని కలగలిపి అందరితో శెభాష్ అనిపించుకున్నారు. ఆయన వాగ్ధాటి ఎలాంటిదంటే.. భారత ప్రధానిగా ఉన్న నెహ్రూనే ఓ సందర్భంలో.. అటల్ జీ దేశానికి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీని, దాని మిత్రపార్టీలను ధీటుగా ఎదుర్కొని.. మిత్రపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అధికారం హస్తగతం చేసుకున్న నేత వాజ్‌పేయి. ప్రధానిగా పూర్తి పదవీకాలం పూర్తి చేసిన తొలి కాంగ్రెసేతర నేతగా వాజ్‌పేయి నిలిచారు. ఆర్‌ఎస్ఎస్, జనసంఘ్ నుంచి వచ్చినా... బీజేపీ లీడర్ గా ఎదిగినా.. అన్నివర్గాల ప్రజల మనసును గెలుచుకున్న వ్యక్తి అటల్ బీహారీ వాజ్ పేయి. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఎన్డీయే కూటమికి సెక్యూలర్ ఫేస్ ఇవ్వడానికి ఎంతగానో కృషిచేశారాయన. అటల్ బిహారీ వాజపేయి డిసెంబర్ 25 1924 న గ్వాలియర్ లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు కృష్ణాదేవి, కృష్ణబిహారీ వాజపేయి. ఆయన తాత పండిట్ శ్యాం లాల్ వాజపేయి వారి పూర్వీకుల నివాస ప్రాంతమైన ఉత్తరప్రదేశ్ లోని బటేశ్వర్ నుండి గ్వాలియర్ లోని మోరీనాకు వలస వెళ్ళాడు. ఆయన తండ్రి కృష్ణబిహారీ వాజపేయి గ్వాలియర్ ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడు, కవి. వాజపేయి గ్వాలియర్ లోని సరస్వతి శిశు మందిర్ లో విద్యాభ్యాసం చేశాడు. గ్వాలియర్ విక్టోరియా కళాశాల (ప్రస్తుతం లక్ష్మీబాయి కళాశాల)లో చేరి హిందీ, ఆంగ్లము, సంస్కృతంలో అత్యంత ప్రతిభావంతునిగా పట్ట భద్రుడైనాడు. కాన్పూరు లోని దయానంద ఆంగ్లో వైదిక కళాశాలనుండి రాజనీతిశాస్త్రంలో ఎం.ఎ పట్టాను పొందాడు. ఎం.ఎ డిగ్రీని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనాడు. వాజపేయి గ్వాలియర్లో ఆర్య సమాజపు యువ విభాగమైన ఆర్య కుమార్ సభతో తన సామాజిక కార్యశీలతను ప్రారంభించి, 1944లో ఆ విభాగానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఆయన 1939 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)లో కూడా చేరాడు. బాబా ఆమ్టే ప్రభావంతో ఆయన 1940-44 లలో అధికార్ల శిక్షణా కేంద్రానికి హాజరైనాడు. ఆయన 1947 లో "పూర్తి స్థాయి సేవకుడు" అనగా ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ అయ్యాడు. ఆయన దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్ల వల్ల న్యాయ శాస్త్ర విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేశాడు. రాష్ట్రీయ స్వయంసేయక్ సంఘ్ విస్తారక్ గా ఉత్తరప్రదేశ్ వెళ్ళిన వాజపేయి, అక్కడ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నడుపుతున్న "రాష్ట్రధర్మ" (హిందీ మాసపత్రిక), "పాంచజన్య" (హిందీ వారపత్రిక) పత్రికలలోను, స్వదేశ్", "వీర్ అర్జున్" వంటి దిన పత్రికలలోనూ పనిచేయటం ప్రారంభించాడు. వాజపేయి జీవితాంతం బ్రహ్మచారిగా జీవించాడు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో, ఆయన తన అన్న ప్రేమ్‌తో కలిసి 23 రోజుల పాటు అరెస్టయిన సందర్భంలో వాజపేయికి తొలిసారిగా రాజకీయాలతో పరిచయ మేర్పడింది. 1951 లో క్రొత్తగా ఏర్పడిన భారతీయ జనసంఘ్ అనే హిందూ దక్షిణ పక్ష రాజకీయ పార్టీలో పనిచేయడానికి, దీన్ దయాళ్ ఉపాధ్యాయతో పాటు వాజపేయిని ఆర్.ఎస్.ఎస్ నియమించింది. ఇది ఆర్.ఎస్.ఎస్ తో కలిసి పనిచేస్తున్న రాజకీయ పార్టీ. ఆయన ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పార్టీ ఉత్తర విభాగానికి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. అనతి కాలంలోనే జనసంఘ్ నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అనుయాయిగా, సహాయకునిగా మారాడు. 1957లో వాజపేయి బల్రామ్‌పూర్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. ఆయన వాగ్ధాటి మూలంగా, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏదో ఒకరోజు వాజపేయి దేశ ప్రధాని అవుతాడని ఊహించాడు. ఆయనకు గల వాగ్ధాటి, సంస్థాగతమైన నైపుణ్యాల కారణంగా జనసంఘ్‌లో ముఖ్యనేతగా ఎదిగాడు. దీన్దయాళ్ ఉపాధ్యాయ మరణానంతరం జనసంఘ్ మొత్తం బాధ్యత, యువ వాజపేయిపై పడింది. 1968 లో జనసంఘ్ జాతీయ అధ్యక్షునిగా ఎదిగాడు. నానాజీ దేశ్‌ముఖ్, బాల్‌రాజ్ మధోక్, లాల్ కృష్ణ అద్వానీ లతో కలిసి జనసంఘ్‌ను జాతీయస్థాయి ప్రాముఖ్యతను సంతరించుకునే దిశగా నడిపించాడు. 1975, 1977 ల మధ్య, భారత జాతీయ కాంగ్రెసు పార్టీకి చెందిన ప్రధాని, ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జన్సీ కాలంలో అనేకమంది విపక్ష నాయకులతో పాటు అరెస్టు అయ్యాడు. 1977 లో సంఘ సంస్కర్త జయప్రకాశ్ నారాయణ్, కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా సంఘటితమై పోరాడటానికి, అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు ఇచ్చిన పిలుపు మేరకు, వాజపేయి జనసంఘ్‌ను క్రొత్తగా ఏర్పడిన సంకీర్ణ కూటమి, జనతాపార్టీలో విలీనం చేశాడు. 1977 సార్వత్రిక ఎన్నికలలో జనతా పార్టీ విజయం తరువాత ఆయన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశాడు. విదేశీ వ్యవహారాల మంత్రిగా ఆయన ఐక్యరాజ్య సమితి యొక్క సర్వప్రతినిధి సభలో హిందీలో ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచాడు. 1979లో జనతా ప్రభుత్వం కూలిపోయే నాటికి వాజపేయి, స్వతంత్రంగా గౌరవప్రథమైన రాజకీయవేత్తగా, అనుభవజ్ఞుడైన నాయకునిగా ఎదిగాడు. వాజపేయి, జనసంఘ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ల నుండి వచ్చిన తన సహచరులను, ముఖ్యంగా దీర్ఘకాల స్నేహితులైన ఎల్.కె.అద్వానీ, భైరాన్ సింగ్ షెకావత్ లను కలుపుకొని 1980 లో భారతీయ జనతా పార్టీని ఏర్పరచి, మొట్టమొదటి అధ్యక్షునిగా పనిచేసాడు. జనతా ప్రభుత్వం తర్వాత వచ్చిన ఇందిరా కాంగ్రెసు ప్రభుత్వానికి బలమైన విమర్శకునిగా అవతరించాడు. 1995 నవంబరులో ముంబాయిలో జరిగిన బి.జె.పి సమావేశంలో బి.జె.పి అధ్యక్షుడైన లాల్ కృష్ణ అద్వానీ వాజపేయిని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించాడు. 1996 మే నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బి.జె.పి విజయం సాధించింది. వాజపేయి 1996 నుండి 2004 ల మధ్య మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. వాజపేయి ప్రభుత్వం యేర్పడిన నెలరోజులలోనే ప్రోక్రాన్ అణు పరీక్షలు జగిపారు. ఢిల్లీ-లాహోర్ బస్సును 1999 ఫిబ్రవరిలో ప్రారంభించారు. కార్గిల్ యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య మే - జూలై 1999 లో కాశ్మీర్ లోని కార్గిల్ జిల్లాలోను, మరికొన్ని సరిహద్దుల వద్దనూ జరిగింది. మూడవ దఫా పరిపాలనా కాలంలో అనేక దేశీయ ఆర్థిక, మౌలిక సంస్కరణలను చేపట్టాడు. వాటిలో ప్రైవేటు రంగాన్ని, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాడు. నేషనల్ హైవే డెవలప్‌మెంటు ప్రాజెక్టు", "ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన" వాజపేయి అభిమాన ప్రాజెక్టులు చేపట్టాడు.2001 లో వాజపేయి ప్రభుత్వం, ప్రాథమిక, మాధ్యమిక విద్యాభివృద్ధి లక్ష్యంగా సర్వశిక్షా అభియాన్ అనే ప్రసిద్ధ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2005 డిసెంబర్ నెలలో వాజపేయి క్రియాశీల రాజకీయాలనుండి నిష్క్రమిస్తున్నట్లు ప్రకటించి, "ఇకనుండి లాల్ కృష్ణ అద్వానీ, ప్రమోద్ మహాజన్‌లు భారతీయ జనతా పార్టీకి రామలక్ష్మణుల వంటివారు" అని ప్రకటించాడు. భారతదేశ రాజ్యసభలో అప్పటి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ తన ప్రసంగంలో వాజపేయిని రాజకీయ భీష్మునిగా అభివర్ణించాడు. అటల్ బిహారీ వాజ్‌పేయిని ఆయన శత్రువులు కూడా విమర్శించరు. 'అజాత శత్రువు, సర్వప్రియుడు, సర్వమాన్య' లాంటి ఉపమానాలను ఆయన పేరుతో జోడిస్తారు. అనారోగ్య కారణాలతో అటల్ జీ 2018 ఆగష్టు 16న మృతి చెందారు. అటల్ జీ జన్మదినమైన డిసెంబర్ 25 ను భారత ప్రభుత్వం సుపరి పాలనా దినంగా ప్రకటించింది.

# కాలాన్ని జయించిన కథానికా చిత్రం.. 'షోలే'

- 51 వసంతాలు పూర్తి చేసుకున్న భారతీయ వెండితెర అద్భుతం
- జై-వీరూ స్నేహం నుంచి గబ్బర్ భీకరత్వం వరకు చెరగని ముద్ర
- యాక్షన్.. ప్రేమ.. హాస్యం.. ప్రతీకారం.. అన్నింటినీ కలిపిన అపూర్వ సినీ కావ్యం
- తరాలు మారినా తగ్గని ఆదరణ.. భారతీయ ప్రజా సంస్కృతిలో భాగమైన సంభాషణలు




1975 ఆగస్టు 15న దేశం అత్యవసర పరిస్థితి చీకటిలో మునిగిపోయిన రోజులలో, పండుగ దీపంలా వెలిగిన సినిమా 'షోలే'. రమేష్ సిప్పీ ధైర్యమైన దర్శకత్వం, సలీం-జావేద్ అజరామరమైన కథనం, ఆర్‌డి బర్మన్ మధురమైన స్వరాలు, అపూర్వమైన తారాగణం-ఈ సంగమం భారతీయ చిత్రసీమకు చిరస్మరణీయమైన మాస్టర్‌పీస్‌ను అందించింది. ప్రారంభంలో స్పందన సాధారణంగానే ఉన్నప్పటికీ, కొద్ది రోజుల్లోనే మౌఖిక ప్రచారం అగ్నికీలలా వ్యాపించి దేశవ్యాప్తంగా థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళ లాడాయి. ముంబై మినర్వా థియేటర్‌లో ఐదేళ్లకు పైగా నిరంతర ప్రదర్శన కొనసాగి రికార్డు నెలకొల్పింది. మొదటి ప్రదర్శనలోనే దేశీయ వసూళ్లు ₹350 మిలియన్లు దాటగా, దాదాపు శతకోటికి పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. 1979లో సోవియట్ యూనియన్ విడుదలతో మొదటి రన్‌లోనే 48.4 మిలియన్ టికెట్లు విక్రయమై, పునర్విడుదలలతో 6 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడై అంతర్జాతీయ స్థాయిలోనూ విజయ పతాక ఎగరేసింది. ఈ చిత్రమే రెండు దశాబ్దాలపాటు




భారతీయ సినీ చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. గ్రామీణ భారతపు నేపథ్యం ఉన్నప్పటికీ, కథ నిర్మాణం డకాయిట్ వెస్ట్రన్ శైలిలో హాలీవుడ్ స్పఘెట్టి వెస్ట్రన్‌ల స్ఫూర్తిని భారతీయ మసాలా మేళవింపుతో స్వదేశీకరించింది. రామగఢ్ అనే ఊరిని ఘరానా దొంగ గబ్బర్ సింగ్ భీకర సంకెళ్ళ నుంచి విముక్తి చేయాలనే సంకల్పంతో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారి థాకూర్ బల్దేవ్ సింగ్, చిన్నచిన్న నేరాలలో పరిమితమై నిమగ్నమైన సాహసవంతులైన జై-వీరూను నియమించు కోవడం కథా కేంద్రం. థాకూర్ చేతులను నరికి వేసిన గబ్బర్ క్రూరత్వానికి ప్రతీకారం తీర్చే ప్రతిజ్ఞ, జై-వీరూ స్నేహం, వీరూ-బసంతి ఉల్లాసం, జై-రాధా నిశ్శబ్ద ప్రేమ, గబ్బర్ భీకరత-ఈ భావరేఖలు కథనాన్ని లోతుగా పటిష్టం చేశాయి. పాత్రల ఎంపికే సినిమా శాశ్వత కీర్తికి పునాది అయింది. జై గా అమితాబ్ బచ్చన్ నిశ్శబ్ద ధైర్యాన్ని, వీరూ గా ధర్మేంద్ర ఉత్సాహం-తరుణోన్మత్తతను, బసంతి గా హేమ మాలిని మాటల వేగం-నృత్య లావణ్యాన్ని, రాధా గా జయ భాదురి మృదువైన విషాదాన్ని, థాకూరు గా సన్జీవ్ కుమార్ ప్రతిఘటన సంకల్పాన్ని, గబ్బర్ గా అమ్జద్ ఖాన్ భీకరత-వికృత హాస్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. "కిత్నే ఆద్మీ థే?", "అరే ఓ సంభా!", "హోలీ కబ్ హై?" వంటి గబ్బర్ సంభాషణలు పల్లెల నుంచి పట్టణాల దాకా జన జీవనంలో భాగమయ్యాయి. సాంకేతికంగా 'షోలే' భారతీయ సినిమాకు కొత్త దారిని చూపింది. బెంగళూరు సమీపంలోని రామనగర రాతి ప్రదేశాలలో రెండు సంవత్సరాలకు పైగా సాగిన చిత్రీకరణ, అప్పట్లోనే 70 మి.మీ. వైడ్‌స్క్రీన్ ప్రింట్లు, ఆరు ట్రాక్ స్టీరియోఫోనిక్ సౌండ్ వినియోగం భారతీయ ఎగ్జిబిషన్ కల్చర్‌కు కొత్త ప్రమాణాలు సృష్టించాయి. హింసాత్మక ఘట్టాలపై సెన్సార్ సూచనలతో అసలు 204 నిమిషాల వెర్షన్‌ను 198 నిమిషాలకు కుదించారు. అసలు ముగింపులో థాకూర్, గబ్బర్‌ను సంహరించే దృశ్యం ఉండగా, సెన్సార్ మార్పులతో గబ్బర్ పోలీసుల చేత అరెస్టవడం చూపించారు. 2014లో 3డి విడుదల, 2025లో ఇటలీ బొలోనియాలో 'ఇల్ సినిమా రిత్రోవాటో'లో రీస్టోర్డ్ ప్రింట్ ప్రత్యేక ప్రదర్శనఈ చిత్రం కాలాన్ని దాటి పునరావిష్కృతమవుతూ వస్తోంది. సంగీతం విషయంలో ఆర్.డి. బర్మన్ స్వరాలు కథనానికి ఆత్మను అందించాయి. "యే దోస్తీ హమ్ నహీ తోడేంగే" జై-వీరూ స్నేహాన్ని శాశ్వతం చేస్తే, "మెహబూబా మెహబూబా" దేశ. వ్యాప్తంగా ఉత్సవ గీతంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ గబ్బర్ ఘట్టాలకు భీకరమైన ముద్ర వేసింది. విడుదల సమయంలో కొంత మీడియా విమర్శించినప్పటికీ, ప్రేక్షకుల ఉత్సాహం వసూళ్లను ఆకాశానికెత్తింది. చైనా, సోవియట్ యూనియన్ వంటి మార్కెట్లలో విడుదలై అంతర్జాతీయ గుర్తింపును తెచ్చుకుంది. అవార్డుల పరంగా 1976లో 23వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్‌లో అత్యధిక నామినేషన్లు పొందినప్పటికీ, చివరికి ఎడిటర్ ఎం.ఎస్. శిందేకు మాత్రమే బెస్ట్ ఎడిటింగ్ అవార్డు దక్కింది. కానీ 2005లో 50 ఏళ్ల ఫిల్మ్‌ఫేర్ సందర్భంగా 'పచాస్సాల్ కా బెస్ట్ ఫిల్మ్'గా ఎంపికైంది. 2002లో బ్రిటిష్ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ నిర్వహించిన పోలింగ్‌లో టాప్ 10 భారతీయ చిత్రాలలో ప్రథమ స్థానం, 2023లో టైమ్ అవుట్ జాబితాలో '100 బెస్ట్ ఇండియన్ ఫిల్మ్స్'లో అగ్రస్థానం సాధించింది. చిత్రీకరణ స్థలం రామనగర నేడు 'షోలే హిల్స్'గా పర్యాటక కేంద్రమై, సినీ యాత్రికులకు యాత్రా స్థలంగా మారింది. తెరపై నిలిచిన జై-వీరూ స్నేహం, గబ్బర్ క్రూరత్వం, థాకూర్ ధర్మ సంకల్పం, బసంతి ఉల్లాసం, రాధా నిశ్శబ్దం భారతీయ సామూహిక స్మృతిలో చిరస్థాయిగా నిలిచాయి. డకాయిట్ వెస్ట్రన్, మసాలా, యాక్షన్, హాస్యం, ప్రేమ, ఉత్కంఠ-అన్నీ కలగలిపి- ప్రధాన ప్రవాహంలో స్థిరపరిచిన ఈ చిత్రం తర్వాతి తరాల కథకులకు పాఠశాలగా నిలిచింది. యాభై ఏళ్ల తరువాత కూడా 'షోలే' కేవలం ఒక సినిమా కాదు, అది భారతీయ ప్రజా సంస్కృతికి నాడీ స్పందన, శబ్ద-దృశ్యాల సృజనాత్మకతకు ప్రతీక, తరతరాల గుండెల్లో అజరామరంగా నిలిచిన కల.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పుంభావ సరస్వతి వానమామలై

## నేడు వానమామలై వరదాచార్యులు జయంతి

**తెలుగుదేశం ఆధునికపు కవితా పోకడలకు అలవాటు పడిన కాలమది. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచనకవిత్వం లాంటి ఎన్నో నూతన సాహిత్య ప్రయోగాలాతో వర్ధిల్లుతున్న కాలంలో, ప్రాచీన కవితారీతులతో ప్రజలను మెప్పించిన కవి వానమామలై. అమూల్య సాహిత్య సంపదను తెలుగువారి కందించిన అద్వితీయ కవితా విశారదుడు, వాగీశ్వరీ మంత్ర సిద్ధిని పొందిన మహనీయుడు పుంభావ సరస్వతి వానమామలై వరదాచార్య. ఒక మహాకవి పోతన చరిత్రను మరోకవి గ్రంథస్థం చేయడం విశేషమే మరి.**



వానమామలై (1914-1984), 1914 ఆగస్టు 16న వరంగల్ జిల్లా మడికొండ గ్రామంలో వైఖానస బ్రాహ్మణుల పండిత కుటుంబంలో జన్మించారు. రైతు కుటుంబములో జన్మించిన వరదాచార్యులు ఏడవ తరగతి వరకు మాత్రమే చదివి ఎల్... సంస్కృతాంధ్ర సాహిత్యం, తార్కికం, వేదాంతం, వ్యాకరణాలను అభ్యసించారు. సంస్కృతం, తెలుగు, ఉర్దూ, హిందీ, ద్రవిడం, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో పట్టు సాధించారు. హరికథాగానంలో ప్రావీణ్యతను సంతరించు కున్నారు. ఈయన అన్నలైన వానమామలై వేంకటాచార్యులు, వానమామలై లక్ష్మణాచార్యులు, వానమామలై జగన్నాథా చార్యులు కూడా సాహిత్యకారులే. కాళోజీ, పల్లా దుర్గయ్య, ఆచార్య బిరుదురాజు రామరాజువంటి సాహితీ దిగ్గజాలు మడికొండకే చెందిన వారేకాక, ఆయన ఆత్మీయులు కూడా.

ఆయన సహజ పాండిత్యాన్ని గుర్తించిన అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా నిజామాబాద్ జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడిగా నియమించారు. తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తునుండి విశారద పట్టా పుచ్చుకున్నారు. విశారద పూర్తయ్యాక చెన్నూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యి 13 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసి 1972లో పదవీ విరమణ చేశారు. చెన్నూరులో వేదపాఠశాల నెలకొల్పారు. 1972లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు శాసనమండలికి నామినేట్ చేయగా 1978 వరకు శాసనమండలి సభ్యుడిగా కొనసాగారు.

1968లో పోతన చరిత్రము గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ విశిష్ట సభ్యత్వము, 1973లో కరీంనగర్ జిల్లా కోరుట్లలో భారతీ సాహిత్య సమితి వారిచే గండపెండేరం, స్వర్ణ కంకణం, రాత్నాభిషేకం,1976లో సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం, వారణాసి వారిచే డి.లిట్ వాచస్పతి గౌరవ పట్టా పొందారు. అభినవ కాళిదాసు, మహాకవి శిరోమణి, ఆంధ్ర కవిత ఉత్ప్రేక్ష చక్రవర్తి, అభినవ పోతన, ఆంధ్ర కవివతంస, మధురకవి, కవి కోకిల, కవిశిరో వతంస తదితర బిరుదాంచితులైనారు.

తెలంగాణ ప్రజలను జాగృతం చేసేందుకు హైదరాబాద్ రాజ్యంలో (తెలంగాణ) నిజాం నియంతృత్వ పాలనను వర్ణిస్తూ అనేక పాటలు, పద్యాలు రాశారు. పౌరాణికుడిగా ప్రదర్శనలు ఇచ్చారు. హరికథలు, పురాణాలు చెప్పారు. "పోతన చరిత్రము" వ్రాసి "అభినవ పోతన"గా వాసికెక్కిన వానమామలై తెలంగాణా కవులలో అగ్రగణ్యుడు, అపూర్వ సాహితీ దురంధరుడు.... దాశరథి కృష్ణమాచార్యులకు అతి సన్నిహితులు, ఆచార్య సి. నారాయణరెడ్డికి అత్యంత ఆప్తుడు, ఎన్నో గేయకృతులు, వ్యాసాలు, నాటకాలు, బుఱ్ఱకథలు ఎన్ని వ్రాసినా.. తెలుగు సాహిత్యంలో ఆయనకు సుస్థిర స్థానాన్ని సముపార్జించి పెట్టింది "పోతన చరిత్రము". మహాభాగవత కర్త మహాకవి బమ్మెర పోతన్న జీవిత విశేషాలను అద్వితీయ ప్రబంధంగా అందించిన ఘనత మన వరదన్నదే. అలా తెలుగు రచయితల సంఘం ఆయనకు "అభినవ పోతన" బిరుదునిచ్చి సత్కరించింది. ఆయన వరదన్న పుట్టి పెరిగింది మడికొండలోనే అయినా స్థిరపడింది తాత ముత్తాతల ఊరైన చెన్నూరు లోనే.

'వరదన్నకు చిన్ననాటనే బాల్యగురువైన కాళోజీ రంగారావు శ్రీరామ తారక మంత్రోపదేశం గావించారు. మంథెనవాసి మేనమామ తిరువరంగం గోపాలాచార్యులు వాగీశ్వరి మంత్రోపదేశం చేయగా, ఖాజీపేట సమీపంలోగల మెట్టుగుట్టపై ఎనభైరోజులు కఠోరదీక్షతో ఉపాసించి వాణీ కటాక్ష వరసిద్ధిని పొందినట్లు చెపుతారు. ఇతని శతజయంతి ఉత్సవాలు 18-8-2011 నుండి 18-8-2012 వరకు జరిగాయి. ఈ సందర్భంగా అనేక సభలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ లోని జగన్నాథ ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. క్షయవ్యాధి పీడితుడై, ఊపిరి తిత్తులకు పది సార్లు శస్త్రచికిత్సతో ఒక ఊపిరితిత్తి తోనే కడదాకా జీవించి,1984, అక్టోబరు 30నఈ లోకాన్ని వీడి వెళ్ళారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# అగార్కర్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం?

### లంక సిరీస్ తర్వాత భవిష్యత్‌పై నిర్ణయం

శ్రీలంకతో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత భారత క్రికెట్ జట్టులో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ భవిష్యత్తుపై బీసీసీఐ పెద్దలు సమావేశం కానున్నట్లు సమాచారం. సెప్టెంబర్‌తో అగార్కర్ మూడేళ్ల పదవీకాలం పూర్తవుతుంది. మరో ఏడాది పొడిగింపునకు ఆయన అర్హత ఉన్న నేపథ్యంలో బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా రోహిత్ శర్మ భవిష్యత్తుపై సెలెక్టర్లు, బీసీసీఐ మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు వార్తలు రావడం చర్చకు కారణమైంది. శ్రీలంక సిరీస్ తర్వాత జరిగే సమావేశంలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. రోహిత్‌ను వన్డే జట్టులో కొనసాగించే విషయాన్ని సిరీస్ వారీగా పరిశీలించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం. అయితే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాత్రం రోహిత్ దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత ఉన్నంతకాలం కొనసాగుతాడని వ్యాఖ్యానించారు. దీంతో సెలక్షన్ కమిటీ నిర్ణయాలు, బీసీసీఐ వైఖరి మధ్య సమన్వయంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే సమయంలో ఇంగ్లండ్‌పై లార్డ్స్‌లో రోహిత్ శర్మ 138 పరుగుల అద్భుత సెంచరీ సాధించడం ఆయన భవిష్యత్తుపై చర్చను మరింత ఆసక్తికరంగా మార్చింది. భారత మాజీ కోచ్ రవిశాస్త్రి కూడా రోహిత్ తన బ్యాటింగ్‌తో విమర్శలకు సమాధానం చెప్పాడని ప్రశంసించారు. ఇప్పుడు అందరి చూపు శ్రీలంక సిరీస్ ముగిసిన తర్వాత జరిగే బీసీసీఐ-అగార్కర్ సమావేశంపైనే ఉంది. అగార్కర్‌కు పొడిగింపు ఇస్తారా? సెలక్షన్ కమిటీలో మార్పులు చేస్తారా? రోహిత్ భవిష్యత్తుపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? అన్నది కీలకంగా మారింది. 2027 వన్డే ప్రపంచకప్ దిశగా జట్టును సిద్ధం చేసే క్రమంలో సెలక్షన్ విధానంపై కూడా చర్చ జరిగే అవకాశముంది. దీంతో శ్రీలంక సిరీస్ ఫలితాల కంటే సిరీస్ తర్వాత బీసీసీఐ తీసుకునే నిర్ణయాలపైనే క్రికెట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.



# భళా పడిక్కల్.. బ్యాట్‌తో అదరగొట్టాడు!

### బ్యాక్‌ఫుట్ గేమ్‌తో సరికొత్త సంచలనం

శ్రీలంకతో తొలి టెస్టులో దేవదత్ పడిక్కల్ భళా అనిపించాడు! అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి సెంచరీతో తన సత్తా చాటాడు. గాలే వేదికగా అజేయంగా 131 పరుగులు చేసి భారత స్కోరును 288/2కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ వెనుక పడిక్కల్ కష్టపడిన తీరు ఉందని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ చెప్పారు. ముఖ్యంగా బ్యాక్‌ఫుట్ గేమ్, షాట్ సెలెక్షన్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాడని వెల్లడించారు. స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు బ్యాక్‌ఫుట్ షాట్లతో పాటు స్టెప్‌అవుట్, స్వీప్ షాట్లను కూడా సాధన చేశాడని తెలిపారు. శ్రీలంక స్పిన్నర్ జయసూర్య బౌలింగ్‌లో ముందుకొచ్చి కొట్టిన భారీ సిక్స్, ఇన్నింగ్స్‌లో దాదాపు 40 పరుగులు స్వీప్ షాట్లతో రావడం పడిక్కల్ ప్రణాళిక ఎంత పక్కాగా అమలు చేశాడో చూపించింది. అవకాశం కోసం ఎదురుచూస్తూ, గత కొన్నేళ్లుగా చేసిన కష్టానికి ఈ సెంచరీ ఫలితమని కోటక్ ప్రశంసించారు. ఇక సాయి సుదర్శన్ తిరిగొచ్చిన తర్వాత నంబర్ 3 స్థానంపై పోటీ ఆసక్తికరంగా మారనుంది. పరిస్థితులకు తగ్గట్టు ఆడే బ్యాటర్‌కే ప్రాధాన్యం ఉంటుందని కోటక్ స్పష్టం చేశారు.

# 218.. ప్రపంచ రికార్డులో స్మిత్!



ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్ అరుదైన ప్రపంచ రికార్డును సమం చేశాడు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మూడు క్యాచ్‌లు అందుకున్న స్మిత్.. టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఆటగాడిగా ఇంగ్లండ్ స్టార్ జో రూట్‌తో సమానంగా నిలిచాడు. ఇద్దరి ఖాతాలో ఇప్పుడు 218 క్యాచ్‌లు ఉన్నాయి. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో లిటన్ దాస్, ముష్ఫికర్ రహీమ్, నజ్ముల్ హొస్సేన్ షాంటో క్యాచ్‌లను స్మిత్ అందుకున్నాడు. అయితే ఈ ఘనతను స్మిత్ కేవలం 124 టెస్టుల్లోనే సాధించడం విశేషం. రూట్ 166 టెస్టుల్లో 218 క్యాచ్‌లు పట్టాడు. ఈ జాబితాలో భారత దిగ్గజం రాహుల్ ద్రవిడ్ 210 క్యాచ్‌లతో మూడో స్థానంలో ఉన్నాడు. మహేల జయవర్ధనే 205, జాక్స్ కలిస్ 200 క్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ ఇంకా ఉండటంతో స్మిత్‌కు రూట్‌ను అధిగమించే అవకాశం ఉంది. దీంతో ప్రపంచ రికార్డుపై ఉత్కంఠ కొనసాగుతోంది.




# పడిక్కల్ సెంచరీ

- **శ్రీలంకపై భారత్ జోరు**
- **తొలిరోజు బ్యాటింగ్ అదుర్స్**

శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టు మొదటి రోజే భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఆట ముగిసే సమయానికి భారత్ 288/2 పరుగులు చేసింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేసి ఆకట్టుకున్నాడు. 178 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 131 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్ భారత జట్టుకు భారీ స్కోరుకు బలమైన పునాది వేసింది.

### పడిక్కల్‌కు రాహుల్ అండ

ఓపెనర్ కేఎల్ రాహుల్ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. పడిక్కల్‌తో కలిసి 150 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి శ్రీలంక బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. అయితే 77 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద చేతి కండరాల్లో సమస్యతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. రాహుల్ ఇన్నింగ్స్‌లో నిలకడతో పాటు అనుభవం కనిపించింది. మరోవైపు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 16 పరుగులకే పెవిలియన్ చేరాడు.

### క్రీజులో పంత్... పటిష్టంగా భారత్

శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్యకు గిల్ వికెట్ దక్కింది. యశస్వి జైస్వాల్ 32 పరుగుల వద్ద రనౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌ను పడిక్కల్, రిషభ్ పంత్ కలిసి నిలబెట్టారు. పంత్ 36 బంతుల్లో రెండు ఫోర్లతో 27 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. తొలి రోజే 288 పరుగులు సాధించడంతో భారత్ మ్యాచ్‌పై పట్టు బిగించింది. రెండో రోజు కూడా ఇదే దూకుడు కొనసాగిస్తే భారీ స్కోరు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రీలంక బౌలర్లపై పూర్తి ఆధిపత్యం సాధించిన భారత బ్యాటర్లు.. తొలి టెస్టును ఘనంగా ప్రారంభించారు.

# విజయ్ రణబాలి నుంచి పోస్టర్

స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం **1854`1878** కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. 'మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మి ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.






# సైరాబాను ఫస్ట్ లుక్ విడుదల

హీరో ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త తెలుగు చిత్రం 'సైరాబాను' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నేడు, స్వాతంత్య దినోత్సవ సందర్భంగా ఆఫీషియల్‌గా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన 'మసూద' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత రాజేష్ దండా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తుండగా, ఈ చిత్రం ద్వారా ఫణి కృష్ణ సిరికి దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా విభిన్న సంస్కృతుల నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ అండ్ వైబ్రెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. ఔట్ అండ్ ఔట్ కామెడీ, ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర స్వరాలను అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించనుంది. అయితే పోస్టర్‌లోని నేపథ్యం కథను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. ఒకవైపు హిందూ దేవాలయం, మరోవైపు ఇస్లామిక్ శైలిలో నిర్మించిన కట్టడం రెండు విభిన్న ప్రపంచాలను ఒకే ఫ్రేమ్‌లో నిలబెట్టినట్లుగా అనిపిస్తోంది. మధ్యలో ఎగురుతున్న తెల్ల పావురాలు శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ పోస్టర్ లుక్ మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో హీరో ఆది సాయికుమార్ పక్కా తెలుగు సాంప్రదాయాలు, పద్ధతులు ఉన్న కుటుంబానికి చెందిన యువకుడిగా నటిస్తున్నారు. అలాగే, హీరోయిన్ బాంధవి శ్రీధర్ ఆధునిక ఆలోచనలు ఉన్న ముస్లిం యువతి (సైరాబాను) పాత్రలో కనిపిస్తున్నారు. వేర్వేరు నేపథ్యాలు, ఆచారాలు ఉన్న ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా చిగురించింది, వారి ప్రేమను గెలిపించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడ్డారు అనేదే ఈ సినిమా కథాంశంగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఈ ప్రేమకథను ఎమోషనల్‌గానే కాకుండా, రెండు కుటుంబాల మధ్య జరిగే ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా కూడా తెరకెక్కిస్తున్నారు.






# కట్టలు తెంచుకున్న రోమాన్స్ .. హుషారు పిట్టలు !

యువతరమే లక్ష్యంగా తీర్చిదిద్దిన తాజా చిత్రం 'హుషారు పిట్టలు'. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ లాంటి పెద్ద సంస్థ దీన్ని స్వయంగా విడుదల చేస్తుండటం.. ప్రేక్షకుల దృష్టి ఈ సినిమాపై పడింది. రవి (అన్ష్) టాపర్. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. చదువు తప్ప మరో ధ్యాస లేని ఆ కుర్రాడిని.. ఊళ్లోని బాలు గ్యాంగ్ అశ్లీల వీడియోలు చూపించి చెడగొడుతుంది. దీంతో పుస్తకాల్ని పక్కకు పెట్టేసి అమ్మాయిల్ని పడేసే పనిలో పడతాడు. ఈ క్రమంలోనే అదే ఊరిలో ఉండే చిట్టి (వాసవి గణెళిశన్) ని ఇష్టపడతాడు. అప్పటికే అతనిపై ఆకర్షణతో ఉన్న ఆమె కూడా అతడికి దగ్గరవుతుంది. పరిపక్వత లేని ఆ వయసులో వాళ్లిద్దరూ హద్దులు దాటేస్తారు. ఓరోజు అలా కలిసి ఉండగా తల్లిదండ్రులకు దొరికిపోతారు. మరి ఆ తర్వాత ఏమైంది? తమ పిల్లల్ని అలా చూడకూడని స్థితిలో చూసిన ఆ తల్లిదండ్రులు ఏమైపోయారు? ఆ బాధని గుండెల్లో దాచుకుని ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు? ఓవైపు అమ్మానాన్నల వ్యతిరేకతను.. సమాజం నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమ కోసం ఏం చేశారు? దాని వల్ల వాళ్ల జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాలేంటి? ఆఖరికి వాళ్లు ఒక్కటయ్యారా.. లేదా? చిన్న వయసులో తెలిసీ తెలియక చేసిన తప్పు వల్ల ఆఖరికి వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అన్నది మిగిలిన కథ.

# ఓటీటీ బాటపట్టిన చెన్నై లవ్ స్టోరీ



కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పుడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.